తెలుగు దినపత్రిక
https://aksharagalam.com

# అక్షరగళం

ప్రతి అక్షరం ప్రజల కోసం

మంగళవారం | అక్టోబర్ 14, 2025

॥ ఎడిటర్: దయాకర్ రెడ్డి ॥

పేజీలు: 8 | వెల: 3 | సంపుటి:3 | సంచిక: 134

## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ అక్రమాలు


- ఓటర్లను భయపెడుతున్న అధికార కాంగ్రెస్
- ఎన్నికల సంఘానికి కెటిఆర్ ఫిర్యాదు



**హైదరాబాద్,అక్టోబర్ 13 (అక్షరగళం):** జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికలో కాంగ్రెస్ కుట్రలు చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఆరోపించారు. నియోజక వర్గ ప్రజలను కాంగ్రెస్ నేతలు ప్రలోభపెడుతున్నారని, ఓటర్లను భయపెడుతున్నారని ధ్వజమెత్తారు. ఈ మేరకు కాంగ్రెస్ పై రాష్ట్ర ఎన్నికల సంఘానికి సోమవారం బీఆర్కే భవన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులో పలు అంశాలని కేటీఆర్ ప్రస్తావించారు.

మిగతా 2లో..

## రాహుల్ ఓట్ చోరీ వ్యాఖ్యలపై విచారణ




- పిల్‌ను తిరస్కరించిన సుప్రీం ధర్మాసనం
- ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించాలని ఆదేశం

**న్యూఢిల్లీ,అక్టోబర్ 13 (అక్షరగళం):** రాహుల్ చేసిన ఓట్ చోరీ వ్యాఖ్యలపై సిట్ విచారణ కోరుతూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. రాహుల్ ఆరోపణలపై విచారణకు మాజీ జడ్జి సారథ్యంలో ప్రత్యేక విచారణ బృందం ఏర్పాటు చేయాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు సోమవారంనాడు తోసిపుచ్చింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాలా బాగ్చిలతో కూడిన ధర్మాసనం పిల్‌ను విచారించేందుకు నిరాకరించింది. ఈ అంశంపై ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచించింది. తాను ఫిర్యాదు చేసినప్పటికీ ఎన్నికల సంఘం ఎటువంటి చర్యలు తీసుకోవట్లేదని పిటిషనర్ అత్యున్నత న్యాయస్థానానికి తెలియజేశారు. దీనిపై కోర్టు స్పందిస్తూ.. రాజకీయ అంశాలకు కోర్టులను వేదిక చేసుకోవద్దని.. ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కోవాలని తేల్చి చెప్పింది. భాజపా, ఎన్నికల సంఘం కలిసి దేశంలో ఓట్ల చోరీకి పాల్పడుతున్నాయని

మిగతా 2లో..

## ఇచ్చిన హామీలకు రేవంత్ మంగళం

- వారికి చెక్ పెట్టాలంటే బీఆర్ఎస్ గెలవాలి
- కారు-బుల్డోజర్ ఫైట్‌లో మనదే గెలుపు
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్, అక్టోబర్ 13 (అక్షరగళం):** బుల్డోజర్ పాలనను అడ్డుకోవడానికి కారుకు ఓటేయాలని కెటిఆర్ అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాజకీయంగా ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించాలనే ఆకాంక్ష ప్రజల్లో ఉందని కేటీఆర్ అన్నారు. జూబ్లీహిల్స్‌లో మన గెలుపు ఖాయం, మెజార్టీ తెచ్చుకోవడమే మన చేతుల్లో ఉందని

మిగతా 2లో..

## సంక్షేమ హాస్టళ్ల అత్యవసర ఖర్చులకు రూ.60 కోట్లు

- భోజనం, జీతాలు, మౌలిక సదుపాయాల మరమ్మతులకు కేటాయింపు
- విద్యార్థులు, ఉద్యోగులు, సిబ్బందికి ఫేసియల్ రికగ్నైజేషన్
- వైద్య కళాశాలలతో హాస్టళ్ల అనుసంధానం.. విద్యార్థులకు వైద్య పరీక్షలు
- ఆహార నాణ్యతను తనిఖీ చేయాలని ఆదేశాలు...
- సంక్షేమ వసతి గృహాల సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి
- వైద్య సేవలు, విద్యా సాంకేతికత, తనిఖీలకు ప్రత్యేక యాప్‌లు



**హైదరాబాద్, అక్టోబర్ 13 (అక్షరగళం):** బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ వసతి గృహాలలో అత్యవసర పనులకు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి రూ.60 కోట్లు కేటాయించింది. ఈ నిధులను హాస్టళ్లలో డైట్ ఛార్జీలు , తాత్కాలిక సిబ్బంది జీతాల విడుదల, హాస్టళ్లలో మోటార్ల మరమ్మతులు, ఇతర అత్యవసర పనులకు వాటిని వినియోగించుకునే వెసులుబాటు కలిగించింది.

హాస్టళ్లకు కేటాయించిన నిధుల చెక్కులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆయా శాఖల సీనియర్ అధికారులకు అందజేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ గృహాలు, విద్యా సంస్థలపై ఐసీసీసీలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు, బోధన , బోధనేతర సిబ్బంది ముఖ గుర్తింపుకు ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. పూర్తి స్థాయి డేటా... జవాబుదారీతనం ఉండాలని ఆయన అన్నారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతను తెలుసుకునేందుకు యాప్‌ను ఉపయోగించాలని సీఎం సూచించారు.

విద్యార్థులకు విద్యార్థులకు సరైన పోషకాలతో కూడిన నాణ్యమైన, పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని... దాంతో వారికి లభించే కేలరీలను తెలుసుకోవాలని ఆదేశించారు.

హాస్టల్ విద్యార్థులకు అందించే యూనిఫాంలు, పుస్తకాలు సకాలంలో సక్రమంగా అందేలా సీనియర్ అధికారులు చూసుకోవాలని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులు నిర్ధరిం చాలని సీఎం సూచించారు. హాస్టళ్లలో ఉన్న సౌకర్యాలు, ఇతర వసతులు, వాటి నిర్వహణకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఎప్పటికప్పుడు డాష్‌బోర్డ్‌లో అప్‌లోడ్ చేయాలని సీఎం ఆదేశించారు. హాస్టళ్లలోని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. ప్రతి జిల్లాలోని ప్రభుత్వ , ప్రైవేట్ వైద్య కళాశాలలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రులను హాస్టళ్లతో అనుసంధానించాలని సీఎం సూచించారు.

హాస్టళ్లలో వైద్య శిబిరాలు నిర్వహించాలని, అత్యవసర సమయాల్లో వైద్యులు విద్యార్థులకు అందుబాటులో ఉండాలని సీఎం ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు తరచుగా హాస్టళ్లను సందర్శించి విద్యార్థులకు మెరుగైన సేవలు అందేలా చూడాలని సీఎం ఆదేశించారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ హాస్టళ్లకు స్కాలర్‌షిప్‌లు , సిబ్బంది జీతాలు , డైట్ ఛార్జీలు , నిర్మాణ ఖర్చులు , ఇతర ఖర్చులు, బకాయిల చెల్లింపు, హాస్టళ్ల నిర్వహణకు అయ్యే నెలవారీ ఖర్చులు, బకాయిల చెల్లింపుకు అవసరమైన మొత్తానికి సంబంధించి కార్యాచరణ ప్రణాళికను రూపొందించి సమర్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సంక్షేమ

మిగతా 2లో..

## యుద్ధ విరమణ వేళ ఇజ్రాయిల్‌లో ట్రంప్ పర్యటన



- పార్లమెంటులో ప్రసంగం..స్వాగతించిన ఎంపిలు
- ప్రధాని నెతన్యాహుకు ట్రంప్ అభినందనలు
- అమెరికా అండ ఎల్లవేళలా ఉంటుందని హామీ

**టెల్అవీవ్,అక్టోబర్ 13 (అక్షరగళం):** హమాస్‌తో యుద్ధ విరమణను స్వాగతిస్తూ, ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహును అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రశంసించారు. థాంక్యూ వెరీమచ్ బీబీ, గొప్పపని చేశావని ప్రధాని

మిగతా 2లో..



## శాంతి ఒప్పందంలో బందీల విడుదల

స్వాగతించిన ప్రధాని మోడీ


**న్యూఢిల్లీ,అక్టోబర్ 13 (అక్షరగళం):** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన 20 సూత్రాల శాంతి ప్రణాళికలో భాగంగా సజీవంగా ఉన్న 20 మంది ఇజ్రాయెలీ బందీలను హమాస్ విడుదల చేయడాన్ని ప్రధాని మోదీ స్వాగతించారు. పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పేందుకు ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలకు మద్దతు ఇస్తున్నట్లు

మిగతా 2లో..

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నోటిఫికేషన్ విడుదల

- 21 వరకు నామినేషన్ల స్వీకరణ
- 22న నామినేషన్ల పరిశీలన
- 24న నామినేషన్ల ఉపసంహరణ గడువు

**హైదరాబాద్,అక్టోబర్ 13 (అక్షరగళం):** హైదరాబాద్ జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్ షెడ్యూల్ విడుదలైంది. ఈ ఎన్నికల ప్రక్రియకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ విడుదల కావడంతో




మిగతా 2లో..

## నేనేంటో అందరికీ తెలుసు

- రూ.251 కోట్లతో సమ్మక్క సారలమ్మ ఆలయాభివృద్ధి
- ఈసారి కోటిమందికి పైగా భక్తులు వస్తారని అంచనా
- నాపై ఫిర్యాదు చేసే ఛాన్సే లేదు
- ఆ వార్తలను నమ్మడం లేదు
- వరంగల్ ఇన్ ఛార్జి మంత్రి రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖమంత్రి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**మేడారం, అక్టోబర్ 13 (అక్షరగళం):** అశేష భక్తుల కొంగు బంగారం సమ్మక్క సారలమ్మ ఆలయాభివృద్ధికి ప్రభుత్వం 251



కోట్ల రూపాయిలు ఖర్చు చేయనున్నట్లు వరంగల్ ఇన్ ఛార్జి మంత్రి రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబం ధాల శాఖమంత్రి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్కతో కలిసి ములుగు జిల్లా మేడారంలోని సమ్మక్క సారలమ్మ ఆలయ అభివృద్ధి

మిగతా 2లో..




## దూసుకుపోతున్న రామచందర్‌రావు

- కమలం క్యాడర్‌లో కొత్త జోష్ నింపుతున్న రామచందర్‌రావు
- ఆయన నడిచొచ్చే కమలం జెండా.
- అధ్యక్షుడిగా ఎన్నికయినప్పటి నుంచి జిల్లాల్లో విస్తృత పర్యటనలు
- అక్కరకొస్తున్న ఏబీవీపీ బంధం
- పర్యటనల్లో జనంతో మమేకం
- వందరోజుల్లో జిల్లాలను చుట్టేసిన 'రామన్న'
- నేతలను హైదరాబాద్‌లో ఉండవద్దని ఆదేశం
- కాంగ్రెస్ సర్కారుపై 'లాయర్ సాబ్' కదనం

**హైదరాబాద్, అక్టోబర్ 13 (అక్షరగళం):** కార్యకర్త స్థాయి నుంచి రాష్ట్ర అధ్యక్షుడి వరకు రాంచందర్ రావు ప్రయాణం పార్టీలో కార్యకర్తల సేవలకు గుర్తింపు లభిస్తుందనడానికి తార్కాణం. కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికై గళమెత్తుతూ సాగుతుంది రాంచందర్ రావు ప్రయాణం. రాంచందర్ రావుని గమనిస్తే.. ఆయన గురించి ఒక్కమాటలో చెప్పాలంటే ఆయన నడిచొచ్చే కమలం జెండా.

బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్. రాంచందర్‌రావు బాధ్య తలు స్వీకరించి 100 రోజులు పూర్తిచేసుకున్నారు. బాధ్యతలు స్వీకరించిన మొదటి రోజునుండే ఆయన దూకుడుతో, నిబద్ధతతో పనిచేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా పర్యటనలు, ర్యాలీలు, సదస్సులు, ప్రజాసమావేశాలు, కార్యక్రమాలు

మిగతా 2లో..

## జైళ్లశాఖ పనితీరు అద్భుతం

- ఖైదీలకు బీమా..కుటుంబ సభ్యులకు రుణాలు
- ఖైదీల పిల్లలకు ప్రైవేట్ స్కూళ్లల్లో చదువులు
- చర్లపల్లి జైలను సందర్శించిన కేంద్రమంత్రి
- డిజి సౌమ్యా మిశ్రాను అభినదించిన మంత్రి బండి సంజయ్




**హైదరాబాద్, అక్టోబర్ 13 (అక్షరగళం):** ఖైదీల సంక్షేమంలో చర్లపల్లి జైలులో చేపడుతున్న సంస్కరణలు దేశానికి ఆదర్శంగా నిలుస్తాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. ఖైదీలకు బీమా సౌకర్యం కల్పించడంతోపాటు, వారి కుటుంబ సభ్యులకు వడ్డీలేకుండా రుణ సదుపాయం కల్పించడం

మిగతా 2లో..

## అత్యంత అవినీతి రాష్ట్రంగా తెలంగాణ

- ఏ పని చేయాలన్నా పర్సెంటీజీలు వసూళ్లు
- కాంగ్రెస్ రాకతో అభివృద్ధి వెనక్కి
- ఉప ఎన్నికలో జూబ్లీహిల్స్ సురుకు తగలాలి
- పార్టీ కార్యకర్తల భేటీలో హరీష్ రావు



**హైదరాబాద్,అక్టోబర్ 13 (అక్షరగళం):** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తెలంగాణను అత్యంత అవినీతి రాష్ట్రంగా మార్చేశారని మాజీ మంత్రి, భారత

మిగతా 2లో..

అక్షరగళం
ప్రతి అక్షరం ప్రజల కోసం

# నేనేంటో అందరికీ తెలుసు

(మొదటి పేజీ తరువాయి)

పనులను పర్యవేక్షించారు. అధికారులతో కలిసి ఆలయ పనుల ప్రగతిని సమీక్షించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా 101 కోట్ల రూపాయిలు మంజూరు చేయగా వీటిలో 71 కోట్ల రూపాయిలకు టెండర్లు పిలవడం జరిగిందన్నారు. గతంలో మంజూరైన 150 కోట్ల రూపాయిలతో కలిపి దశలవారీగా శాశ్వత ప్రాతిపదికన ఆలయాభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

మేడారం జాతరకు వచ్చే నిధులు జంపన్న వాగులో వరదలాగ జారిపోకుండా గిరిజన, గిరిజనేతరుల ఆరాధ్యదైవాల ప్రాంగణాలను అభివృద్ధి చేస్తామని, దీనిలో భాగంగా రోడ్లు ఇతర నిర్మాణాలు సాగిస్తామని చెప్పారు. మరో 50 రోజుల్లో ఈ పనులకు ఎటువంటి ఆటంకం లేకుండా ఒక క్రమపద్ధతిలో సాగేలా కలెక్టర్, ఎస్పీలకు సూచనలు ఇచ్చామన్నారు. ఆలయాభివృద్ధికి ఎవరు ఎటువంటి సలహాలు సూచనలు ఇచ్చినా స్వీకరిస్తామని, ఈ పనులను మంత్రి సీతక్క స్వయంగా పర్యవేక్షిస్తారని అన్నారు.

గతంలో ఈ జాతరకు కోటి మందికి పైగా వచ్చినట్లు అధికారులు చెప్పారని ఈ సారి ప్రభుత్వ అభివృద్ధి చర్యల కారణంగా ఈ సంఖ్య రెట్టింపు అవుతుందన్నారు. మీడియా సమావేశంలో విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు స్పందిస్తూ

"నేనేంటో అందరికీ తెలుసు, 70 కోట్ల కాంట్రాక్ట్ వర్క్‌కు తాపత్రయపడే అవసరం నాకు లేదు. నాపై సహచర మంత్రులు ఫిర్యాదు చేశారంటే నమ్మడం లేదు. ఫిర్యాదు చేయడానికి ఏమంది అధిష్టానానికి ఎవరూ ఫిర్యాదు చేసే ఛాన్సే లేదు. నేను కూడా అలా జరుగుతుందని నమ్మడం లేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు అభివృద్ధి పనులు చేస్తున్నాం. సమ్మక్క సారలమ్మల వంటి సీతక్క, సురేఖ అక్కలతో ఈ కార్యక్రమాలకు హాజరవుతాను"అని మంత్రి పొంగులేటి చెప్పారు. సమావేశంలో ఎంపీ బలరాం నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ ఓట్ చోరీ వ్యాఖ్యలపై విచారణ

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ ఆరోపిస్తున్నారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం దొంగిలించిన ఓట్లతో ఏర్పడిందంటూ రాహుల్ విమర్శించారు. ప్రధానమంత్రి కూడా ఓట్ల తస్కరణకు పాల్పడ్డారని ఆరోపించారు. కొందరు పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం కలిగించేందుకు ప్రజల ఓటు హక్కును దొంగిలించేందుకు భాజపా ప్రయత్నిస్తోందని ఘాటు విమర్శలు చేశారు. త్వరలో బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదేవిధంగా ఓట్లు దొంగలించడానికి కుట్ర పన్నుతున్నారన్నారు. మహారాష్ట్ర సహా ఇతర రాష్ట్రాల్లో ఓట్లు చోరీ చేయడంలో ఎన్డీయే ప్రభుత్వం విజయవంతమైందని.. బిహార్‌లో మాత్రం భాజపా, ఈసీని ఒక్క ఓటు కూడా చోరీ చేయనివ్వబోమని వ్యాఖ్యానించారు. కాగా రాహుల్ చేసిన ఆరోపణలు భాజపా నేతలు, ఎన్నికల కమిషన్ అధికారులు ఖండించారు. తాజాగా దీనిపై పిల్ వేయగా సుప్రీం తిరస్కరించింది. ఎన్నికల జాబితాలో పెద్దఎత్తున అవకతవకలు జరిగాయంటూ లోక్‌సభలో కాంగ్రెస్ విపక్ష నేత రాహుల్ గాంధీ ఇటీవల పలు సందర్భాల్లో ఆరోపించారు. బెంగళూరు సెంట్రల్, ఇతర నియోజకవర్గాల్లో ఎన్నికల జాబితా అవకతవకలపై ఆగస్టు 7న రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను ఉటంకిస్తూ న్యాయవాది, కాంగ్రెస్ సభ్యుడు రోహిత్ పాండే ఈ పిటిషన్ వేశారు. ఎన్నికల జాబితా సన్నాహకాలు, నిర్వహణ, పబ్లికేషన్ విషయాల్లో ఈసీ పారదర్శకత, జవాబుదారీతనంతో వ్యవహరించేం దుకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేయాలని కోర్టును ఆయన కోరారు. అర్థవంతమైన వెరిఫికేషన్, ఆడిట్, పబ్లిక్ స్క్రూటినీకి వీలుగా మెషీన్-రీడబుల్ ఫార్మెట్‌లో ఎన్నికల జాబితాను పబ్లిష్ చేయాలని కూడా కోరారు.

# యుద్ధ విరమణ వేళ ఇజ్రాయిల్‌లో ట్రంప్ పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

బెంజమిన్ నెతన్యాహును పొగిడారు. రెండేళ్లుగా తమ చెరలో ఉన్న బందీలను హమాస్ విడిచిపెట్టిన తరుణంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇజ్రాయెల్‌లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆ దేశ చట్టసభలో మాట్లాడుతూ.. మధ్యప్రాచ్యంలో సరికొత్త చరిత్ర ఉదయిస్తోంది. ఈ పవిత్ర భూమిలో శాంతి వీచికలు వీస్తుండగా ఆకాశం నిర్మలంగా మారింది. తుపాకులు మూగబోయాయి. ప్రస్తుతం అమెరికాలో ఉన్న స్వర్ణయుగం ఇజ్రాయెల్‌లో ప్రారంభమైంది. బందీలు తిరిగివచ్చారు. ఈ మాట చెప్పడం ఎంతో బాగుంది. కాల్పుల విరమణ ఒప్పందానికి సంబంధించి మేం సమయాన్ని వృథా చేస్తున్నామని చాలామంది అన్నారు. కానీ మేం సాధించాం అని ట్రంప్ అన్నారు. రెండో ప్రపంచయుద్ధంలో యూదులపై నాజీలు సాగించిన నరమేధం హోలోకాస్ట్ తర్వాత యూదులపై జరిగిన అత్యంత దారుణంగా అక్టోబర్ 7 దాడులను అభివర్ణించారు. అమెరికా ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని బాధిత కుటుంబాలను ఉద్దేశించి పేర్కొన్నారు. అలాగే మధ్యప్రాచ్యంలో అమెరికా ప్రత్యేక రాయబారిగా ఉన్న స్టీవ్ విట్కాఫ్, తన అల్లుడు, సలహాదారుడు జేర్డ్ కుష్నర్‌ను ఈ సందర్భంగా కొనియాడారు. ఇజ్రాయెల్- హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంలో వీరు కీలకపాత్ర పోషించారు. అయితే ట్రంప్ మాట్లాడుతోన్న సమయంలో కొందరు ఎంపీలు నిరసన వ్యక్తంచేశారు. మారణహోమం అంటూ నినాదాలు చేశారు. దాంతో వారిని చట్టసభ నుంచి బయటకు పంపివేశారు. ఈ నిరసనలపై ట్రంప్‌నకు స్పీకర్ క్షమాపణలు చెప్పారు. ఈ వ్యవహారమంతా గమనించిన ట్రంప్.. సమర్థవంతంగా పనిచేశారని చమత్కరించారు. దాంతో సభ్యులంతా చిరునవ్వులు చిందించారు. ఆ దేశ ప్రధాని నెతన్యాహుతో కలిసి జెరూసలెంలోని చట్టసభకు వెళ్లారు. అక్కడ ఇజ్రాయెల్ చట్టసభ్యులు అగ్రరాజ్య అధ్యక్షుడికి ఘన స్వాగతం పలికారు. కాల్పులు ఒప్పందం చేసినందుకు గానూ.. రెండున్నర నిమిషాలు పాటు లేచి నిలబడి కరతాళధ్వనులతో కృతజ్ఞతలు తెలియజేశారు. ఇజ్రాయెల్‌కు అమెరికా ఎప్పుడూ తోడుగా ఉంటుందని హామీనిచ్చారు. ఈ సమయంలో ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో కాస్త గందరగోళం నెలకొంది. ట్రంప్ మాట్లాడుతున్న సమయంలో పాలస్తీనా-ఇజ్రాయెల్ జాయింట్ పొలిటికల్ పార్టీకి చెందిన ఎంపీ ప్లకార్డు ప్రదర్శించారు. 'పాలస్తీనాను గుర్తించాలి' అంటూ నినాదాలు చేశారు.

# శాంతి ఒప్పందంలో బందీల విడుదల

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. రెండేళ్లకు పైగా హమాస్ చెరలో ఉన్న బందీల విడుదలను స్వాగతిస్తున్నాం. బందీల స్వేచ్ఛ.. సంబంధిత కుటుంబాల ధైర్యానికి, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్థిరమైన శాంతి ప్రయత్నాలకు, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు దృఢ సంకల్పానికి గుర్తింపుగా నిలుస్తోంది. పశ్చిమాసియా ప్రాంతంలో శాంతిని నెలకొల్పేందుకు ట్రంప్ చిత్తశుద్ధితో చేస్తున్న ప్రయత్నాలకు మద్దతు ఇస్తున్నాం' అని పేర్కొంటూ ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. ట్రంప్ ప్రతిపాదిత శాంతి ప్రణాళిక తొలిదశలో భాగంగా ఇజ్రాయెల్, హమాస్‌లు ఇటీవల కాల్పుల విరమణకు అంగీకరించాయి. ఈ క్రమంలోనే నేడు 20 మంది సజీవ బందీలను హమాస్ అప్పగించింది. 28మంది ఇజ్రాయెల్ పౌరుల మృతదేహాలను కూడా త్వరలోనే అప్పగించనుంది. ఇందుకు ప్రతిగా ఇజ్రాయెల్ కూడా పాలస్తీనా ఖైదీలను విడుదల చేసింది.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నోటిఫికేషన్ విడుదల

(మొదటి పేజీ తరువాయి)

నామినేషన్ల పర్వం మొదలయ్యింది. నామినేషన్లను స్వీకరించడానికి చివరి తేదీ అక్టోబర్ 21 మంగళవారంగా నిర్ణయించింది. . అలాగే నామినేషన్ల పరిశీలన అక్టోబర్ 22 బుధవారం నాడు జరుగుతుంది. అభ్యర్థిత్వం ఉపసంహరణకు చివరి తేదీగా అక్టోబర్ 24 శుక్రవారంగా నిర్ణయించారు. పోలింగ్ నవంబర్ 11న నిర్వహిస్తారు. అలాగే ఓట్ల లెక్కింపు నవంబర్ 14న జరిపి అదేరోజు ఫలితం ప్రకటిస్తారు.

అభ్యర్థులు తమ నామినేషన్లను షేక్‌పేట్ తాసీల్దార్ కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి. నామినేషన్లను ఫారం-2బిలో దాఖలు చేయాల్సి ఉంటుంది. అభ్యర్థి తప్పనిసరిగా ఫారం-26లో అఫిడవిట్‌ను సమర్పించాలి. అన్ని పత్రాలపై అభ్యర్థి సంతకం, నోటరీ సంతకం, నోటరీ సీల్‌తో నోటరైజ్ చేయాలి. అక్టోబర్ 19 ఆదివారం, అక్టోబర్ 20 దీపావళి తేదీల్లో పబ్లిక్ సెలవులు కారణంగా నామినేషన్లను స్వీకరించబడవు. ఇక ఈ ఉప ఎన్నికల్లో పోటీ చేయడానికి అభ్యర్థికి కనీసం 25 సంవత్సరాలు నిండి ఉండాలి. గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులకు నియోజకవర్గానికి చెందిన ఒక్క ఓటరు ప్రపోజర్‌గా ఉండాలి. ఇతర అభ్యర్థులకు మాత్రం నియోజకవర్గానికి చెందిన పది మంది ఓటర్లు ప్రపోజర్లుగా ఉండాలి. అలాగే సెక్యూరిటీ డిపాజిట్ విషయానికి వస్తే జనరల్ కేటగిరీకి రూ.10,000, ఎస్సీ/ఎస్టీ కేటగిరీకి కుల ధృవీకరణ పత్రంతో పాటు రూ.5,000 నగదు చెల్లించాలి.

# దూసుకుపోతున్న రామచందర్‌రావు

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. ఉమ్మడి నల్గొండ, మెదక్, ఖమ్మం, వికారాబాద్, కరీంనగర్ జిల్లాల్లో పర్యటించి కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ స్థాయినుండి జెడ్పీటీసీ దాకా బిజెపి అభ్యర్థులు బలంగా పోటీ చేసేలా పార్టీని సిద్ధం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ స్థాయి నుంచి జెడ్పీటీసీ వరకు బీజేపీ ప్రత్యక్షంగా పోటీ చేస్తుందని, అభ్యర్థులను గెలిపించే బాధ్యత తానే తీసుకుంటానని స్పష్టం చేశారు.

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం, గత బీఆర్ఎస్ ప్రభుత్వం వైఫల్యాలను ఎండగడుతూ, తెలంగాణకు మోదీ ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని వివరించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఎండగడుతూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరంగా పోరాటం చేస్తున్నారు. జీఎస్టీ తగ్గింపు ద్వారా పేదలు, మధ్యతరగతి ప్రజలు, రైతులు, విద్యార్థులు, ఎంఎస్ఎంఈలు లాంటి వర్గాలకు లబ్ధి చేకూర్చేలా తీసుకున్న చరిత్రాత్మక నిర్ణయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మోదీ ప్రభుత్వం గ్రామీణ పేదల కోసం ఉచిత బియ్యం, ఇళ్ళు, మరుగుదొడ్లు, గ్యాస్ కనెక్షన్లు, మహిళా పొదుపు సంఘాలకు బ్యాంక్ రుణాలు, యువతకు స్వయం ఉపాధి రుణాలు వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని వివరించారు. గ్రామాల్లో రోడ్లు, మరుగుదొడ్లు, వీధి దీపాలు, శ్మశానవాటికలు, రైతు వేదికలు, హరిత హారం కింద మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు కేంద్ర సహకారంతోనే జరుగుతున్నాయని తెలిపారు.

'పల్లె నిద్ర' వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలతో మమేకమవుతూ, గ్రామాల నాడి తెలుసుకుంటూ, ప్రతి నియోజకవర్గంలో పార్టీని ప్రజలకు మరింత చేరువ చేసే దిశగా ముందుకు సాగుతున్నారు. ముఖ్యంగా బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న అసంబద్ధ విధానాలపై ఎప్పటికప్పుడు విరుచుకుపడ్డారు.

రైతులకు ఎరువులను సక్రమంగా సరఫరా చేయకుండా, బ్లాక్ మార్కెట్‌కి తరలించేందుకు కారణమవుతున్న రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, సకాలంలో రైతులకు ఎరువులు అందేలా చర్యలు తీసుకున్నారు.

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చక పోవడాన్ని, బీసీ రిజర్వేషన్లలో అవ్యవస్థలను ఎండగడుతూ, రైతులకు ఎరువులు అందేలా ఒత్తిడి తీసుకువచ్చి ప్రజా సమస్యల పక్షాన నిలిచారు. జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్యతరగతి, చిన్న వ్యాపారులకు లబ్ధి చేకూర్చిన మోదీ ప్రభుత్వ నిర్ణయాన్ని గ్రామ గ్రామానికి తీసుకెళ్లి ప్రజల్లో అవగాహన కల్పించారు. రాజకీయ జీవితంలో నాలుగు దశాబ్దాలుగా నిబద్ధత, క్రమ శిక్షణ, ప్రజాసేవకు అంకితమైన ఈ జాతీయవాది, ఇప్పుడు తెలంగాణలో బిజెపిని ప్రతి పల్లె, ప్రతి ఇంటి దాకా తీసుకెళ్లే రథసారథిగా ముందుకు నడిపిస్తున్నారు.

కార్యకర్త నుంచి పార్టీ అధ్యక్షుడి దాకా నాలుగు దశాబ్దాల ప్రయాణం అపూర్వంగా నిలుస్తోంది. విద్యార్థి నేతగా రాడికల్‌లతో పోరాడి, ప్రజా సేవలో క్రమశిక్షణతో ఎదిగిన నాయకుడు రాంచందర్ రావు. రాష్ట్రంలో అధికార పీఠం సాధించడమే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తున్నారు. పుట్టుక నుంచీ సిద్ధాంతానికి నిబద్ధుడైన నిఖార్సైన జాతీయవాది. విద్యార్థి దశ నుంచే దేశానికి అంకితమైన కాషాయ సైనికుడు, ఇప్పుడు రాష్ట్ర బిజెపి కి సారథ్యం వహిస్తున్నారు.

రైతులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, అగ్రవర్ణ పేదల సమస్యలపై అడుగడుగునా పోరాడుతూ బిజెపిని ఇంటిం టికీ, ప్రజా మనసుల్లోకి తీసుకెళ్తూ కృషి చేస్తున్నారు. రాష్ట్రంలోని అందరు నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో సమన్వయం కల్పిస్తూ బీజేపీని ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి చేర్చే దిశగా ఎన్. రాంచందర్ రావు కృషి చేస్తున్నారు.

# జైళ్లశాఖ పనితీరు అద్భుతం

(మొదటి పేజీ తరువాయి)

అభినందనీయమన్నారు. మహిళా ఖైదీల పిల్లలను ప్రైవేట్ స్కూళ్లలో చద విస్తూ ఫీజులను కూడా జైళ్ల శాఖ చెల్లించడం గొప్ప విషయమన్నారు. ఈ విషయంలో జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా విజన్ ను అభినందించకుండా ఉండలేమన్నారు. కస్టడీ-కేర్-కరక్షన్ కు సౌమ్య మిశ్రా నిజమైన ఆచరణ రూపమిస్తున్నారని చెప్పారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సోమవారం చర్లపల్లి జైలును సందర్శించారు. జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రాతోపాటు ఆ శాఖ ఉన్నతాధికారులు కేంద్ర మంత్రికి ఘన స్వాగతం పలికారు. చర్లపల్లి జైలులో చేపట్టిన అభివృద్ధి పనులను కేంద్ర మంత్రి పరిశీలించారు. ఖైదీల కోసం ఏర్పాటు చేసిన ఇండస్ట్రీలను, వారు తయారు చేస్తున్న ఉత్పత్తులను అడిగి తెలుసుకున్నారు. గోశాలను సందర్శించారు. గోవులకు స్వయంగా తన చేతితో మేత తిన్పించారు. ఒక లేగ ఆవుకు 'క్రిష్ణ' అంటూ నామకరణం చేశారు. జైలు ఆవరణలో ఏర్పాటు చేసిన రిక్రియేషన్ క్లబ్, బంతి పూలవనాన్ని సందర్శించారు. తేనె టీగలతో తేనె ఏ విధంగా పడుతున్నారనే విషయాన్ని స్వయంగా తిలకించారు.

అనంతరం ఖైదీల కోసం జైళ్ల శాఖ చేపట్టిన సంస్కరణలను కేంద్ర మంత్రికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. ఖైదీల సంక్షేమం, చర్లపల్లి జైలు అభివృద్ధి విషయంలో జైళ్ల శాఖ డీజి విజన్ అద్భుతమని కేంద్ర మంత్రి కొనియాడారు. ఇతర రాష్ట్రాల జైళ్ల శాఖలు సైతం చర్లపల్లి జైలును సందర్శించి సంస్కరణలు అమలు చేసేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ఖైదీలు తయారు చేస్తున్న ఉత్పత్తులు నాణ్యమైనవిగా ఉన్నందున హైదరాబాద్ లో




'ప్రత్యేకంగా మేళా' నిర్వహించి ఆయా ఉత్పత్తులు ప్రజలకు అందించాలని సూచించారు. జైళ్ల శాఖకు కేంద్రం అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్, జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా, చర్లపల్లి జైలు సూపరింటెండ్ శివకుమార్ గౌడ్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. 25 ఏళ్ల క్రితం చర్లపల్లి జైలును నిర్మించారని నాటి నుండి నేటి వరకు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చర్లపల్లి జైలు అభివృద్ధి కోసం ఇప్పటి వరకు రూ.11.60 కోట్లు మంజూరు చేయగా, రూ. 11.30 కోట్లు ఖర్చు చేసి వివిధ అభివృద్ధి పనులను చేపట్టినట్లు పేర్కొన్నారు. సౌమ్య మిశ్రా జైళ్ల శాఖ డీజీగా బాధ్యతలు చేపట్టిన తరువాత విప్లవాత్మకంగా సంస్కరణలు చేపట్టారన్నారు. ఖైదీల కుటుంబ సభ్యులకు వీడియో లింక్ ద్వారా తాము ఉన్న ప్రాంతాల నుండే మాట్లాడే (ములాఖత్) అవకాశాన్ని కల్పించి నట్లు తెలిపారు. ఖైదీలకు బీమా సౌకర్యాన్ని వర్తింపజేసినట్లు పేర్కొన్నారు. ఖైదీలు చదువుకునేందుకు విస్తృత అవకాశాలు కల్పించడంతోపాటు చదవు పూర్తయ్యాక డిగ్రీలు కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. ఖైదీల ఆరోగ్యంపైనే ప్రత్యేక దృష్టి సారించామని, నిష్ణాతులైన డాక్టర్లను నియమించినట్లు పేర్కొన్నారు. ప్రతి రోజు సగటున 150 మంది వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారని, ప్రతి రోగికి ప్రత్యేక హెల్త్ ప్రొ÷ల్ ను రూపొందించినట్లు వివరించారు. ఖైదీలకు ప్రతిరోజు యోగా, ధ్యానం, పీఈటీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఖైదీలకు స్కిల్ డెవలెప్ మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి ప్రత్యేక శిక్షణ ఇచ్చి వివిధ రంగాల్లో ప్రత్యేకంగా ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. ఖైదీలు విడుదలైన తరువాత పెట్రోలు బంకుల్లో ఉద్యోగాలు కల్పిస్తూ ప్రతి నెలా రూ.18 వేల చొప్పున కనీస వేతనాలు చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. అట్లాగే జైళ్ల శాఖ సిబ్బంది సంక్షేమం, ఆరోగ్యం, క్రీడా విషయాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. క్రీడా పోటీల్లో తెలంగాణ జైళ్ల శాఖ అధికారులు అగ్రగామిగా నిలుస్తున్నారని తెలిపారు. జైళ్ల శాఖ అందిస్తున్న సేవలు, చేస్తున్న అభివృద్ధికి గాను ప్రతిష్టాత్మకమైన స్కోడా అవార్డు వచ్చినట్లు వివరించారు.

# ఇచ్చిన హామీలకు రేవంత్ మంగళం

(మొదటి పేజీ తరువాయి)

తాజాగా జరిగిన సభలో ఆయన వ్యాఖ్యానించారు. ఈ నెల రోజులు ప్రతి ఇంటికి వెళ్లి కాంగ్రెస్ చేసిన మోసం ప్రజలకు చెప్పాలని.. కారు, బుల్డోజర్ మధ్య యుద్ధం జరుగుతుందని, రాష్ట్రం అంతా జూబ్లీహిల్స్ వైపు చూస్తోందని ఆయన అన్నారు. అలాగే అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీ ఇస్తామని రేవంత్ రెడ్డి ఒక కాగితం ఇచ్చాడు. కానీ, కోర్టు కేసులో ఉన్న అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీ రావడం అసాధ్యం అన్న విషయం రేవంత్‌కే తెలుసునని ఎద్దేవా చేశారు. ఇది కేవలం ఓట్ల కోసమే చేస్తున్న రాజకీయ నాటకమని, గెలవలేక పక్క దారులు పడుతున్నారని ఆయంబ విమర్శలు గుప్పించారు. ఒక్క ఇంట్లోనే 40 దొంగ ఓట్లు రాయించుకున్నారని విమర్శించారు. గత ఎమ్మెల్యే గోపీనాథ్ మరణంపై ఆయన సంతాపం వ్యక్తం చేస్తూ.. ఆ కుటుంబం అనాథ కాదు. ఆ కుటుంబానికి మేమందరం అండగా ఉన్నాం. ఈరోజు బీఆర్ఎస్ కుటుంబ సభ్యులందరం జూబ్లీహిల్స్‌లో వారికి బలం ఇవ్వడానికి వచ్చాం అని అన్నారు. ఇక జూబ్లీహిల్స్‌లో పోరు మొదలైందని.. ప్రజలు మన దిక్కు ఉన్నారని, నిజం మన దిక్కు ఉంది, ధర్మం మన దిక్కు ఉందని ఆయన అన్నారు. కాంగ్రెస్ మోసం చేసినందుకు ప్రజలు స్వయంగా సమాధానం చెబుతారని.. మోసపోయిన ప్రజలు, ముఖ్యంగా మహిళలు, ఈసారి కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పే సమయం వచ్చిందని పేర్కొన్నారు. ఈ నెల రోజులు ప్రతి




కార్యకర్త ఇంటింటికి వెళ్లి నిజం చెప్పాలని.. జూబ్లీహిల్స్‌లో గులాబీ జెండా ఎగరడం మనందరి లక్ష్యం కావాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పెద్దలు ముసలమ్మలకు, ముసలయ్యలకు నెలకు రూ.4000 ఇస్తామని చెప్పారు. ఇప్పుడు 24 నెలలు గడిచాయి.. ఒక్క పైసా ఇచ్చారా? బాకీ మొత్తం రూ.48,000 అయ్యింది. అలాగే 18 ఏళ్లు నిండిన ఆడబిడ్డలకు నెలకు రూ.2,500 ఇస్తామని చెప్పిన హామీ కూడా నెరవేర్చలేదు. నిరుద్యోగ భృతి, మహాలక్ష్మి పథకం అన్నీ మాటలకే పరిమితం అయ్యాయని కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన బాకీల లెక్కను ప్రజల ఇంటింటికీ తీసుకెళ్లాలి. ప్రతి ముసలమ్మకు రూ.48,000, ప్రతి మహిళకు రూ.50,000 బాకీ ఉన్నదని బాకీ కార్డుతో చెప్పాలి. ఈ సారి కాంగ్రెస్ మోసానికి తగిన బుద్ధి చెప్పే సమయం వచ్చిందని కేటీఆర్ అన్నారు.

# జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ అక్రమాలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ నేతలు పెద్ద కుట్రకు తెరలేపారని ఆక్షేపించారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఓటు చోరీ అవుతోందని అంటుంటే, జూబ్లీహిల్స్‌లో మాత్రం కాంగ్రెస్ నేతలే ఓటు చోరీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 20 వేల దొంగ ఓట్లని సృష్టించారని ఫైర్ అయ్యారు. ఆధారాలతో సహా రాష్ట్ర ఎన్నికల సంఘానికి పిర్యాదు చేశానని తెలిపారు. కొవ్వూరి కార్తీక్ పేరుతో మూడు చోట్ల ఓట్లు ఉన్నాయని.. దీపక్ శర్మ అనే వ్యక్తికి రెండు చోట్ల ఓట్లు ఉన్నాయని ఆరోపించారు. కింది స్థాయి అధికారులు కాంగ్రెస్‌తో కుమ్మక్కై దొంగ ఓట్లను సృష్టించారని మండిపడ్డారు. దొంగ ఓట్ల పైన విచారణ జరగాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌తో కుమ్మక్కైన కింది స్థాయి అధికారులపైన చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని కోరారు. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక నామినేషన్ పక్రియ పూర్తి అయ్యేలోపు 20 వేల దొంగ ఓట్లను తొలగించాలని డిమాండ్ చేశారు. నిష్పక్షపాతంగా జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక జరగాలని మాజీ మంత్రి కేటీఆర్ కోరారు.

# సంక్షేమ హాస్టళ్ల అత్యవసర ఖర్చులకు రూ.60 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్‌లను ఆదేశించారు. హాస్టళ్ల కోసం కేంద్ర ప్రాయోజిత పథకాల నుంచి నిధులను సమీకరించాలని, వాటికి సంబం ధించి రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్‌ను వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. 24 గంటలూ ఆన్‌లైన్‌లో వైద్యులు అందుబాటులో ఉండేలా హాట్‌లైన్ ఏర్పాటు చేయాలని, పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి ఎడ్ టెక్‌ను ఉపయోగించుకోవాలని సీఎం సూచించారు. హాస్టల్ విద్యార్థులకు అందించే సేవలను సోషల్ మీడియా ద్వారా తెలియజేయాలని, ఉద్దేశపూర్వకంగా చేసే తప్పుడు ప్రచారాన్ని అడ్డుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. వీటన్నింటికీ అవసరమైన యాప్‌లను రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

# అత్యంత అవినీతి రాష్ట్రంగా తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర సమితి నేత హరీశ్‌రావు విమర్శించారు. ఏ పని జరగాలన్నా కాంగ్రెస్ నేతలు కమిషన్లు అడుగుతున్నారని ఆరోపించారు. రహమత్‌నగర్‌లో పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌ను ఓడిస్తేనే ఆరు గ్యారంటీలు అమలవుతాయి. మా హయాంలో పేదల కోసం బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేశాం. అక్కడ పనిచేసే వైద్యులు, సిబ్బందికి జీతాలు ఇవ్వడం లేదు. ఔషధాలు కూడా ఉండటం లేదు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లే కూలుస్తున్నారు.. పెద్దలవి కూల్చడం లేదని హరీశ్‌రావు ఆరోపించారు. ఆరు గ్యారంటీలు వంద రోజుల్లో అమలు చేస్తామని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం హామీలు ఇచ్చిందని.. 700 రోజులు దాటినా వాటిని అమలు చేయడం లేదని.. అందుకే అందుకే రేవంత్ రెడ్డికి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో సురుకు తగలాలని ప్రజలు కోరుకుంటున్నారని హరీశ్‌రావు అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక చాలా ముఖ్యమైన ఎన్నిక అని..యావత్ తెలంగాణ ప్రజలు జూబ్లీహిల్స్ వైపు చూస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ చిత్తు చిత్తుగా ఓడితే రేవంత్ రెడ్డికి కనువిప్పు కలుగు తుందని రాష్ట్ర ప్రజలు చూస్తున్నారన్నారు. లేకుంటే ఆరు గ్యారెం టీలు ఎగ్గొట్టినా, హామీలు అమలు చేయకపోయినా, హైడ్రా పేరిట పేదల ఇండ్లు కూల్చినా నాకే ఓటు వేశారని రేవంత్ అంటాడని చెప్పారు. ఉద్యోగాలు రావాలన్నా.. పింఛన్లు రావాలన్నా, పథకాలు అమలు కావాలన్నా, హైడ్రా ఆగాలన్నా బీఆర్ఎస్ పార్టీ గెలవాలి, మాగంటి సునీతా గెలవాలన్నారు. రెండేళ్లలో రేవంతు రెడ్డి రాష్ట్రాన్ని అవినీతిమయంగా చేసిండని.. కేసీఆర్ ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దితే, అత్యంత అవినీతి రాష్ట్రంగా తయారు చేసిండని మండిపడ్డారు. బిల్డింగ్ పర్మిషన్‌కు స్క్వేర్ ఫీట్‌కు రూ.75, ఫైనాన్స్ బిల్లు క్లియర్ కావాలంటే 12శాతం కమిషన్ ఇవ్వాలట అంటూ ఆరోపించారు. ఇళ్లు జాగ, భూముల సమస్యలు పరిష్కారం కావాలంటే 40 శాతం భూములు రాసి వ్వాలట.. మొత్తం పర్సెంటేజీలు డిసైడ్ చేసిండని ధ్వజమెత్తారు. ఒకప్పుడు తెలంగాణ అంటే పెట్టుబడులకు స్వర్గధామమని.. తెలంగాణ ఏ పథకం ప్రారంభిస్తే దేశం మొత్తం ఆ పథకం ప్రారంభించేదనితెలంగాణ అనుసరిస్తే, దేశం ఆచరించేదన్నారు. ఒక రాష్ట్రం ఎట్ల ఉండాలో కేసీఆర్ తయారు చేస్తే, రాష్ట్రం, సీఎం ఎట్ల ఉండగూడదో రేవంతు తయారు చేసిండని విమర్శించారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చారని.. గాంధీ టోపీలు పెట్టి ప్రజలను మోసం చేశారని.. కేసీఆర్ 350 బస్తీ దవాఖానలు ప్రారంభించారని.. ఉచితంగా పరీక్షలు చేసే విధంగా డయాగ్నోస్టిక్స్ సెంటర్లు ప్రారంభిస్తే రేవంత్ ప్రభుత్వం బస్తీ దవాఖానలకు సుస్తీ పట్టించిందని.. ఆరు నెలలుగా బస్తీ దవాఖానల వైద్య సిబ్బంది జీతాలు చెల్లించడం లేదు, మందులు లేవన్నారు. వాళ్లకు జీతాలు ఇవ్వకుండా మీకు వైద్య సేవలు అందకుండా రేవంత్ రెడ్డి చేస్తున్నాడని ధ్వజమెత్తారు. బస్తీ దవాఖానలు చూస్తే కేసీఆర్ గుర్తుకు వస్తారు, కాబట్టి బస్తీ దవాఖానల ఉనికి లేకుండా చేస్తున్నడని.. నీళ్ల బిల్లులు అధికంగా వసూలు చేస్తున్నారన్నారు. కేటీఆర్ మున్సిపల్ మంత్రిగా ఉన్నపుడు 20వేల లీటర్ల వరకు బిల్లులు లేవని.. రేవంతు వచ్చిండు బిల్లులు వసూలు చేస్తున్నారన్నారు. జూబ్లీహిల్స్‌లో గెలుపు మాగంటి సునీతమ్మ గెలుపు మాత్రమే కాదని.. తెలంగాణ ప్రజల గెలుపు అని తెలిపారు. హైడ్రా పెట్టి పెద్దోళ్ల ఇండ్లు కూల్చుతలేదు గానీ, పేదోళ్ల ఇండ్లు కూల్చుతున్నడని.. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మహేందర్ రెడ్డి చీఫ్ విప్, గాంధీల ఇండ్లు, భూములు హైడ్రాకు ఎందుకు కనబడటం లేదని.. గరీబోళ్ల ఇండ్లే హైడ్రాకు కనబడుతున్నాయా? అంటూ నిలదీశారు. 'హైడ్రా కతం హోనాహే.. కాంగ్రెస్ కో హరానేహే.. హైడ్రా బంద్ హోనాతో .. మాగంటి సునితమ్మకో జితానాహే' అన్నారు. కాంగ్రెస్ గెలిస్తే మీ ఇండ్ల ముందుకు బుల్డోజర్ వస్తది.. అది రావొద్దు అంటే సునితమ్మను గెలిపించాలని పిలుపునిచ్చారు. ముస్లింలను కాంగ్రెస్ దారుణంగా మోసం చేసిందని.. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రి ఇవ్వలేదన్నారు. కేసీఆర్ డిప్యూటీ సీఎం, హోం మినిస్టర్ ఇచ్చారని గుర్తు చేశారు. కేసీఆర్, మహమూద్ అలీ ఇద్దరే మొదట మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారన్నారు.

షాదీ ముబారక్ కింద తులం బంగారం అన్నాడని.. తులం జాడ లేదు గానీ కల్యాణ లక్ష్మి చెక్కు ఏడాది దాటినా ఇవ్వడం లేదన్నారు. కేసీఆర్ కిట్ బందు, బతుకమ్మ చీర బందు, రంజాన్ తోఫా బంద్, ఓవర్సీస్ స్కాలర్ షిప్ బందు, దళిత బందు బందు, బీసీ బందు బందు, బస్తీ దవాఖాన ఖతం పట్టించారని ఆరోపించారు. హిందు, ముస్లిం అందరం కలిసి హైద్రాబాద్‌ను, తెలంగాణను కాపాడుకోవాలన్నారు. ఇది మాగంటి సునితమ్మ గెలుపు కాదని.. బీఆర్ఎస్ కార్యకర్తల గెలుపు, తెలంగాణ గెలుపుగా అందరం కలిసి కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ కార్యకర్తలు బాగా కలిసి పనిచేస్తున్నారని.. కేటీఆర్, తాను జూబ్లిహిల్స్‌ను ఆనుకొని ఉన్నామన్నారు

తెలుగు దినపత్రిక https://aksharagalam.com
అక్షరగళం
ప్రతి అక్షరం ప్రజల కోసం
తెలంగాణ రౌండప్

# ఆర్టీసీ ఎండి నాగిరెడ్డికి శుభాకాంక్షలు



**హైదరాబాద్, అక్టోబర్ 13, (అక్షర గళం):** ఆర్టీసీ ఎండిగా భాధ్యతలు చేపట్టిన నాగిరెడ్డిని సోమవారం టి.ఆరోగ్య రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.



## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఆసిఫ్ అలీ

**ఆమనగల్లు, అక్టోబర్ 13 (అక్షర గళం):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని రేవంత్ మిత్రమండలి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఆసిఫ్ ఆలీ సోమవారం హైదరాబాద్లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. వచ్చే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు సైనికులుగా పనిచేయాలని కాంగ్రెస్దే విజయం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం మాజీ వైస్ ఎంపీపీ వెంకటయ్య గౌడ్ అందజేత

**వెల్దండ అక్టోబర్ 13 (అక్షర గళం):** వెల్దండ మండల పరిధిలోని చెదురుపల్లి గ్రామానికి చెందిన పోలే మహేష్ అనారోగ్యంతో మృతి చెందారు విషయం తెలుసుకున్న వెల్దండ మాజీ ఎంపీపీ వెంకటయ్య గౌడ్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి అధైర్య పడకుండా ధైర్యంగా




ఉండాలని భరోసా కల్పించారు అన్ని విధాలుగా బిఆర్ఎస్ పార్టీ తరపు ఆదుకుంటామని హామీ ఇచ్చారు. మాజీ వైస్ ఎంపీపీ వెంకటయ్య గౌడ్ 10,000 వేల రూపాయలు ఆర్థిక సహాయం మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల యువ నాయకులు పోలే అశోక్ పోలే తిరుపతి బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## కళాకారులకు భజన సామాగ్రి తెలంగాణ ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి ద్వారా బర్కం గణేష్ అందజేత

**వెల్దండ అక్టోబర్ 13 (అక్షర గళం):** వెల్దండ మండల పరిధిలోని రాఘయిపల్లి గ్రామంలో కార్తీక మాసం సందర్భంగా భజన కళాకారులకు కావలసిన సామాగ్రి తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి ద్వారా బిఆర్ఎస్ పార్టీ యువ



నాయకులు బర్కం గణేష్ భజన కళాకారులకు సామాగ్రిని అందజేశారు.

ఈ కార్యక్రమంలో నాగుల శ్రీనివాస్ రామచంద్రారెడ్డి గిరి బాలయ్య ఈదన్న యాదయ్య తదితరులు పాల్గొన్నారు

## సీఎం రేవంత్ రెడ్డితో ఆచారి

**ఆమనగల్లు, అక్టోబర్ 13 (అక్షర గళం):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి సోమవారం ఆయన నివాసంలో ఆప్యాయంగా కలిశారు. ఆచారి కుమారుడు భరత్ నిశ్చితాదానికి రావాలని ఆహ్వాన పత్రికను అందించారు. అదేవిధంగా కల్వకుర్తి నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఆయన వెంట రేవంత్ మిత్రమండలి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆసిఫ్ అలీ, ఉపాధ్యక్షుడు లింగంపల్లి ఆనంద్ ఉన్నారు.



# 'స్థానికం'పై ఉత్కంఠ

- హైకోర్టు స్టేతో ఆశావహులకు షాక్
- ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూపు
- నేతల్లో నిరుత్సాహం

**ఆమనగల్లు, అక్టోబర్ 13 (అక్షర గళం):** ఏడాదిగా "ఎప్పుడో ఎన్నికలు వస్తాయి" అని ఎదురు చూసిన ఆశావహులకు, ఇటీవల ఎన్నికల సంఘం షెడ్యూల్, రిజర్వేషన్ల ప్రకటనతో ఎనలేని ఉత్సాహం వచ్చింది. ఈ నెల 8న హైకోర్టు 42% రిజర్వేషన్లపై స్టే ఇవ్వకుండా నిరాకరించడంతో, ఎన్నికలకు లైన్ క్లియర్ అయినట్లు భావించారు. గురువారం నోటిఫికేషన్ వెలువడడంతో నామినేషన్ ప్రక్రియ ప్రారంభమై మండల కేంద్రాలు చురుకుగా మారాయి. దసరా వేడుకలను ఎన్నికల ప్రచారంగా మలచుకుని నేతలు గెలుపు లక్ష్యాలతో ముందుకు సాగారు. అయితే అదేరోజు మధ్యాహ్నం హైకోర్టు 42% రిజర్వేషన్లపై మధ్యంతర స్టే ఇవ్వడం ఆశావహులకు ఒక్కసారిగా షాక్ తగిలింది.




### ఎన్నికల ప్రక్రియకు బ్రేక్..

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను గౌరవిస్తూ ఎన్నికల సంఘం నామినేషన్ ప్రక్రియను నిలిపివేసింది. ఇప్పటివరకు సాగిన ఎన్నికల సమర కథ మళ్లీ మొదటికి చేరింది. ఎన్నికలపై స్పష్టత లేకపోవడంతో కాలయాపన జరుగుతోందని ప్రతి పక్షాలు ఆరోపిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో అని ఆశావహులు ఎదురు చూస్తున్నారు.

### మొదటి రోజు నామినేషన్లు..

ఇదిలా ఉంటే జిల్లాలో నోటిఫికేషన్ వచ్చిన తొలి రోజే 5 చోట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. కొన్ని ప్రధాన పార్టీల నాయకులు టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేశారు. టికెట్ అవకాశం లేకపోవడంతో పార్టీ మార్చుకున్న వారూ ఉన్నారు. అన్ని ఏర్పాట్లు చేసుకున్న నేతలకు ఎన్నికల ప్రక్రియ నిలిపివేయడం తీవ్ర నిరాశను కలిగించింది.

### గ్రామాల్లో అనిశ్చితి..

బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 9 అమలును హైకోర్టు నిలిపివేయడంతో గ్రామాల్లో చర్చలు ముదిరాయి.

పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు కొనసాగుతాయా? లేక పూర్తిగా నిలిపివేయబడుతాయా? ప్రభుత్వం తుది నిర్ణయం ఏమిటి? అని చర్చించుకుంటున్నారు.





# ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే కఠిన చర్యలు

## ప్రభుత్వ స్థలాలలో అక్రమ నిర్మాణాలను గుర్తించిన అధికారులు

- జమ్మిగడ్డ ప్రభుత్వ స్థలాన్ని సందర్శించిన అధికారులు, ప్రజాప్రతినిధులు
- స్థలాన్ని చదును చేసి ఫెన్సింగ్ వేస్తున్న రెవెన్యూ అధికారులు
- ఏఎస్ రావునగర్ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి

**ఏఎస్ రావునగర్, అక్టోబర్ 13, (అక్షర గళం):** ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే కట్న చర్యలు తీసుకుంటామని అధికారులు ప్రజాప్రతినిధులు స్పష్టం చేశారు జమ్మిగడ్డలోని 199/1, 376 సర్వే నెంబర్లలోని ప్రభుత్వ భూమిలో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలను ఈ సందర్భంగా వారు పరిశీలించారు. ప్రభుత్వ స్థలాలలో వెలుస్తున్న బహుళ అంతస్తుల భవనాలను చూసి అధికారులు ఆశ్చర్య పోయారు. స్థలాన్ని చదును చేసే కార్యక్రమం కొనసాగుతుందని, త్వరలో స్థలానికి ఫెన్సింగ్ వేస్తామని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా 199/1, 376 సర్వే నెంబర్ల లోని ప్రభుత్వ స్థలంపై హైడ్రా అధికారులు దృష్టి సారించినట్లు తెలిసింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవిన్యూ అధికారులు ఇప్పటికే స్థలాన్ని స్వాధీనం చేసేందుకు స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. సంఘటనా స్థలంలో కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ స్థలాలను పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కాప్రా తహసిల్దార్ సుచరిత మాట్లాడుతూ ప్రభుత్వ స్థలంలో చేపట్టిన నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న 12 గంటల భూమిని స్వాధీనం



చేసుకుంటున్నామని తెలిపారు. ఖాళీ స్థలానికి ఈరోజు ఫెన్సింగ్ వేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాప్రా సర్కిల్ ఏసిపి ఎన్ కృష్ణమోహన్, కాప్రా డిప్యూటీ తహసిల్దార్ ప్రవీణ్ కుమార్, సర్వేయర్ మహేందర్, రెవెన్యూ ఇన్ స్పెక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ధర్మ విజయ యాత్రని విజయవంతం చెద్దాం: రాచర్ల హైందవి-రవిచంద్ర శర్మ

**కొంపల్లి,అక్టోబర్-13(అక్షర గళం):** లోక కళ్యాణార్థం తలపెట్టిన ధర్మ విజయ యాత్ర పూజ కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని వేద పండితులు రాచర్ల హైందవి-రవిచంద్ర శర్మ అన్నారు.సోమవారం నాడు ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఎన్.సి.ఎల్ నార్త్ కాలనీలో ఈ నెల 17వ తేదీన శ్రీశ్రీశ్రీ భారతి తీర్థ మహా స్వామి అనుగ్రహ ఆశీస్సులతో జగద్గురువులు శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతి స్వామి రానున్నారని అన్నారు.ఈ కార్యక్రమాన్ని శ్రీ దుర్గాదేవి సేవా సమితి సభ ప్రాంగణంలో జరుగుతుందని స్వామి వారి రాకతో ధర్మ విజయ యాత్ర ఉంటుందని స్వామి వారికి వివిధ కళాకారుల నృత్యాలతో స్వాగత పలకడం జరుగుతుంది అన్నారు.17 శుక్రవారం ఉదయం 6గంటలకు చతుర్వేద సదస్సు,వేదస్వస్తి కార్యక్రమంతో ప్రారంభమై 8 గంటలకు స్వామి వారి పాదుకాపూజ దర్శనం ఉంటుందని తెలిపారు.ఈ పూజ కార్యక్రమానికి వేలాది మంది భక్తులు పాల్గొనడం జరుగుతుందని భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తూ





సుమారు9 ఎకరాలలో పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేశామని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కావాల్సిన వసతులు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.ప్రతి ఒక్కరు కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొంది అన్నదాన కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని అన్నారు.ఈ సమావేశంలో కాలనీ వాసులు మరియు పండితులు పాల్గొన్నారు.



## లక్ష్మీనారాయణ సతీమణి స్వరూప మృతి బాధాకరం..

### తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దోకూరి ప్రభాకర్ రెడ్డి..

**కల్వకుర్తి,అక్టోబర్ 13(అక్షరగళం):** లయన్స్ క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ ఎం. లక్ష్మీనారాయణ సతీమణి స్వరూప రాణి సోమవారం మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దోకూరి ప్రభాకర్ రెడ్డి ఆయన నివాసానికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించి ఆకస్మిక మృతి పట్ల తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. ఆమె పార్తివదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం కల్పించారు. పరామర్శించిన వారిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ, రాష్ట్ర కిసాన్ సెల్ కార్యవర్గ సభ్యులు మోహన్ రెడ్డి దేవుని పడకల్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ కాడమోని శ్రీశైలం కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## ఆర్‌టిఐ సామాన్యుడి వజ్రాయుధం

### దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకట్ రెడ్డి

**దమ్మాయిగూడ,అక్టోబర్ 13(అక్షరగళం):**

ప్రశ్నించడం మన ప్రాథమిక హక్కు అని, సమాచార హక్కు చట్టం (ఆర్ టి ఐ) సామాన్యుడి చేతిలో బ్రహ్మాస్త్రం లాంటిదని దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ ఎన్ వెంకట్ రెడ్డి అన్నారు.సోమవారం దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయంలో (ఆర్ టి ఐ) 2025 వారోత్సవాలలో భాగంగా సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్బంగా మున్సిపల్ కమిషనర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. 2025 చట్టం ప్రకారం మున్సిపల్ ప్రజలు సమస్యలు ఏ విధంగా పరిష్కరించుకోవచ్చని



అవగాహన కల్పించారు.(ఆర్ టి ఐ) చట్టం ద్వారా ప్రతి ప్రభుత్వ శాఖ నుంచి కావాల్సిన సమాచారాన్ని తీసుకోవచ్చని తెలిపారు.దీనివల్ల ప్రభుత్వ ఉద్యోగుల్లో పారదర్శకత ఏర్పడుతుందని చెప్పారు. ప్రభుత్వ అధికారులు లంచాలు ఆశించకుండా ప్రజల పనులు త్వరగా పూర్తి చేస్తారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఎ.వెంకటేషం.మున్సిపల్ సిబ్బంది తదితరులు సిబ్బంది పాల్గొన్నారు.

## వెల్జాల్‌లో ఇందిరమ్మ ఇంటి స్లాబ్ పనులను ప్రారంభించిన గ్రామ కాంగ్రెస్ నాయకులు..

**కల్వకుర్తి, అక్టోబర్ 13(అక్షరగళం):** రాష్ట్రంలో ప్రజా పాలన కొనసాగుతున్నదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ రాజ్యం కలలను సహకారం



చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశారు. సోమవారం ఇండ్ల నిర్మాణంలో భాగంగా కోశమోని బుచ్చమ్మ ఇంటి స్లాబ్ పనులను మాజీ ఎంపీటీసీ మల్లి కేడి అంబాజీ మాజీ ఉపసర్పంచ్ అజీజ్ మండల కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండి.ఆరిఫ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతకాయల లక్ష్మణ్ పులిజాల విష్ణు పి.అయిలయ్య యాదవ్ పి.రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పర్యటన..

**కల్వకుర్తి,అక్టోబర్ 13(అక్షరగళం):**

కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని తలకొండపల్లి మండలం ఖానాపూర్ గ్రామపంచాయతీ కర్కస్ తాండ ముత్యాలమ్మ దేవాలయాన్ని మంగళవారం ఉదయం



10:30 గంటలకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పాల్గొంటారని సోమవారం ఐక్యత ఫౌండేషన్ కార్యాలయ మీడియాకు తెలిపారు. కార్యక్రమానికి స్థానిక నాయకులు అభిమానులు కార్యకర్తలు శ్రేయోభిలాషులు పాల్గొనాలని కోరారు.

## సగర సంఘం రాష్ట్ర స్థాయి విద్యార్థుల ప్రతిభ పురస్కార మహోత్సవాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

### - పెద్దబుద్దుల సతీష్ సాగర్

**కొంపల్లి,అక్టోబర్-13(అక్షర గళం):**

తెలంగాణ సగర సంఘం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే రాష్ట్ర స్థాయి సగర విద్యార్థుల ప్రతిభ పురస్కారాల మహోత్సవం ఈ నెల 29వ తేదీన హైదరాబాద్ లోని రవీంద్రభారతి ప్రాంగణంలో నిర్వహిస్తున్నారని సోమవారం నాడు కొంపల్లిలోని తన కార్యాలయంలో తెలంగాణ సగర సంఘం ఉపాధ్యక్షులు పెద్దబద్దుల సతీష్ సాగర్ మరియు రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి ఉప్పరి మహేందర్ విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేశారు.వారు మాట్లాడుతూ తెలంగాణ సగర సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ రాష్ట్ర స్థాయి ప్రతిభ పురస్కారాల మహోత్సవానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల విద్యార్థులకు ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమ



నిర్వహణలో భాగంగా సమాచార ప్రచారంతో పాటు, పురస్కారాల పంపిణీ వరకు సగర యువత ముందుండి దిగ్విజయం చేయాలి. సగర విద్యార్థులను విద్యారంగంలో ప్రోత్సహించే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం తెలంగాణ సగర సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహణ జరుగుతుంది. పదవ తరగతి మొదలుకుని ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, బి. టెక్, యం.టెక్, బి.కాం, బి.ఎస్.సి, యం.బి.బి.ఎస్, యం.డి, పి.జి, పి.హెచ్.డి ఇలా అనేక స్థాయిలో ఉత్తీర్ణులై మెరుగైన ప్రతిభ కనబర్చిన విద్యార్థులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థులకు ఆయా కోర్సులలో వచ్చిన మార్కులు లేదా గ్రేడును బట్టి ఎంపిక చేయడం జరుగుతుంది. అలాగే సాంస్కృతిక, సాహిత్య, క్రీడా తదితర అంశాల్లో రాష్ట్ర, జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో పాల్గొని ప్రతిభ కనబరిచిన వారు కూడా ఈ పురస్కారాలకు అర్హులు అని వారు తెలిపారు.





## కలెక్టరేట్ కార్యాలయంలో సిపిఆర్‌పైన అవగాహన సదస్సు

**మేడ్చల్ ప్రతినిధి, అక్టోబర్ 13, (అక్షర గళం):**

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం జిల్లా, వైద్య ఆరోగ్యం శాఖ ఆధ్వర్యంలో పునర్జన్మ"పేరుతో సిపిఆర్ పైన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిని డాక్టర్ ఉమా గౌరి ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులకు, సిబ్బందికి, పత్రికా ప్రతినిధులకు, ప్రజావాణికి వచ్చిన ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ కలెక్టర్స్ ఎంఎస్ఎస్ భరీర,ఎంఎస్. మోక్షిత హాజరై ఈ కార్యక్రమం యొక్క విశిష్టత గురించి, సిపిఆర్ పై అవగాహన లేకపోవడం వల్ల జరిగే ప్రాణ నష్టం గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ,ఆరోగ్యం శాఖ అధికారిని ఉమా గౌరీ మాట్లాడుతూ పునర్జన్మ వారోత్సవాల్లో భాగంగా వారం రోజులు అన్ని కళాశాలలో, బస్టాండ్,రైల్వే స్టేషన్ వంటి స్థలాలలో అవగాహన కల్పించడం జరుగుతుందని తెలియజేశారు ఈ కార్యక్రమం పై ప్రత్యక్షంగా నమూనా ల ద్వారా శిక్షణ పొందిన డాక్టర్లు శ్రవణ్, వినోద్ , శోభన ల చే అవగాహన కల్పించారు.

ప్రోగ్రాం అధికారిని మల్లీశ్వరి మాట్లాడుతూ ఈ కార్యక్రమంపై విశిష్టంగా అవగాహనా కల్పించాల్సిన అవసరం చాల ఉన్నందున అన్ని శాఖల అధికారులు వారి శాఖల సిబ్బందికి శిక్షణ ఇవ్వవలసిందిగా అందుకు అవసరమైన సహకారం వైద్య ఆరోగ్య శాఖ డాక్టర్స్, సిబ్బంది అందిస్తారని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు సిబ్బంది, వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ గీతా, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్. సత్యవతి, డాక్టర్ చంద్రకళ,డాక్టర్ . వినోద్,వసంత కుమారి, డిప్యూటి డిఈఎంఓ సిబ్బంది పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ వారి ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

**ఆమనగల్లు, అక్టోబర్ 13 (అక్షర గళం):**

జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆదేశానుసారంగా లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు లయన్ రామ్ రెడ్డి ఐ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ మేరకు కంటి వైద్యులు ఎం. చంద్రశేఖర్ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ నేత దానం చేయాలని మరో ఇద్దరికి దృష్టి భాగ్యం కల్పించాలని ఆయన అన్నారు. 50 సంవత్సరాలు పూర్తయిన ప్రతి ఒక్కరు కళ్ళు మసకబారిన వారు కంటిచూపు మందగించిన వారు ప్రతి ఒక్కరు కంటి పరీక్ష చేయించుకోవాలని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరు తమ కళ్ళను సూచి శుభ్రత పాటించాలని ఆయన పిలుపునిచ్చారు. నేత్రదానం మహాదానం అని ఆయన అన్నారు. మనిషి మరణించిన 6 గంటలలోపు తమ కళ్ళను దానం చేస్తే మరో ఇద్దరికి దృష్టి భాగ్యం కల్పించవచ్చునని ఆయన తెలిపారు. మనిషి మరణించిన తర్వాత కూడా తమ కళ్ళు జీవించి ఉంటా యని ఆయన అన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నేత్రదానం చేయాలని కోరారు. ఈ శిబిరంలో 65 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 15 మందిని రామ్ రెడ్డి లయన్స్ ఐ హాస్పిటల్ కు తరలించినట్లు క్లబ్ పిఆర్ఓ పాషా తెలిపారు.




కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు ఎంగలి బాలకృష్ణ, జిల్లా చైర్మన్ బి.యాదయ్య, సంయుక్త కార్యదర్శి కొరివి వెంకటయ్య, ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ మైమున బేగం, హెల్త్ సూపర్వైజర్ తిరుపతిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రజలను మోసం చేసిన ఎమ్మెల్యేకి రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారు...

### బీజేపీ నేతలు పులిబలరాం, ఆకుల సతీష్‌లు

**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 13, (అక్షర గళం):**

ప్రజలను మోసం చేసిన కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యేకి రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని బీజేపీ నేతలు పులిబలరాం, ఆకుల సతీష్ లు అన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం బీజేపీ నేతలు పులి బలరాం, ఆకుల సతీష్ నాయకత్వంలో స్థానిక ప్రజలు కుత్బుల్లాపూర్ డిప్యూటీ కమిషనర్ నరసింహ కి ఫిర్యాదు సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో సుచిత్ర నుండి షాపూర్ నగర్ వరకు వెళ్లే ప్రధాన రోడ్డులో ఫాక్ సాగర్ నాలాపై కేవలం 10 అడుగుల రోడ్ మాత్రమే ఉండటం వల్ల ప్రతిరోజూ వందలాది వాహనదారులు తీవ్ర ట్రాఫిక్ సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమస్యపై పలుమార్లు ప్రజలు ఆందోళన వ్యక్తం చేసినా, ఇప్పటివరకు ఎలాంటి శాశ్వత పరిష్కారం లభించలేదన్నారు. 2022లో ఎస్ఆర్డీపీ ప్రాజెక్టు కింద రూ.56 కోట్ల నిధులు ఈ ప్రాంతానికి మంజూరయ్యాయని సంబంధిత జీవోలో స్పష్టంగా పేర్కొనబడింది. అయితే ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదన్నారు. తన సొంత గ్రామంలోని రోడ్డు విస్తరణ పనుల వల్ల భూములు కోల్పోయిన ప్రజలకు ఇప్పటివరకు నష్టపరిహారం కూడా ఇవ్వలేని చేతగాని ఎమ్మెల్యే ఇప్పుడు బ్రిడ్జ్ పనులు చేయకుండానే సన్మానాలు చేసుకోవడం సిగ్గుచేటని విమర్శించారు.

వెంటనే ఎస్ఆర్డీపీ మరియు జీహెచ్ఎంసీ అధికారులు స్టీల్



బ్రిడ్జ్ నిర్మాణ పనులు ప్రారంభించకపోతే మున్సిపల్ ఆఫీస్ ముందు భారీ ధర్నా చేపడతామని హెచ్చరించారు. జీడిమెట్ల డివిజన్ పరిధిలోని రుక్మిణి ఎస్టేట్ కాలనీలో పార్క్ స్థలాన్ని ఎమ్మెల్యే బంధువులు ఆక్రమించినట్లు స్థానికులు ఫిర్యాదు చేయగా, హైడ్రా అధికారులు తక్షణమే స్పందించి ఆ స్థలాన్ని రక్షించి, కాంపౌండ్ వాల్ నిర్మించి బోర్డు ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు పార్క్ శుభ్రత, పచ్చదనం, బెంచీలు, పిల్లల ఆట స్థల అభివృద్ధి వంటి పనులు చేపట్టకపోవడంపై పులి బలరాం , ఆకుల సతీష్ డిప్యూటీ కమిషనర్‌ను నిలదీశారు. దీనిపై స్పందించిన డిప్యూటీ కమిషనర్ వారం రోజుల్లో పార్కు పూర్తిగా అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నల్ల జై శంకర్ గౌడ్, అరుణ్ రావు, జగదీష్ గుప్తా, దయాకర్, రామకృష్ణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి నాయకుడు గడ్డం మహేందర్ మృతి పట్ల దిగ్భ్రాంతికి లోనైనా బిజెపి కార్యకర్తలు..

**కల్వకుర్తి, అక్టోబర్ 13(అక్షరగళం):** ఊరుకొండ భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా మాజీ మండల అధ్యక్షుడు గడ్డం మహేందర్ సోమవారం మృతి చెందారు. బిజెపి నాయకులు అతని పార్తివదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.గడ్డం మహేందర్ మృతి పట్ల బిజెపి పార్టీ శ్రేణులు కార్యకర్తలు దిగ్భ్రాంతికి లోనయ్యారు. భారతీయ జనతా పార్టీ నిక్కాసైన కార్యకర్తను కోల్పోవడం బాధాకరమని ఆవేదనకు లోనయ్యారు. భారతీయ జనతా పార్టీ జెండాను మోస్తూ నరేంద్ర మోడీ చేపట్టిన ఉజ్వల యోజన పథకం ద్వారా ఊరుకొండ మండలంలో ఎంతోమందికి సిలిండర్లు పంపిణీ చేయడంలో పాత్ర పోషించాడని వృద్ధులకు నేత్రాల అవయవాలు ఆపరేషన్ చేస్తూ ఎంతోమందికి కనుచూపు తెచ్చిన కీలక పాత్ర





పోషించాడని పార్టీ శ్రేణులు ఆవేదన వ్యక్తం చేశారు. గడ్డం మహేందర్ మృతి గ్రామంలో విషాదాచాయాలు అలుముకున్నాయి. బిజెపి పార్టీ ఆధ్వర్యంలో తలకొండపల్లి మండల శాఖ 10,000/- ఆయన భార్యకు దహన సంస్కారాల కోసం ఆర్థిక సహాయం అందజేశారు. బిజెపి పార్టీ జిల్లా మండల నాయకులు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ కన్నీటి వీడ్కోలను అర్పించారు.

# నాగారంలో ఘనంగా సమాచార హక్కు వార్షికోత్సవాలు

### నాగారం మున్సిపల్ కమిషనర్ ఎస్.భాస్కర్ రెడ్డి

**కీసర,అక్టోబర్ 13,(అక్షర గళం) :** "సమాచార హక్కు చట్టం అనేది ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే శక్తివంతమైన సాధనం అని కమిషనర్ ఎస్.భాస్కర్ రెడ్డి అన్నారు.నాగారం మున్సిపాలిటీ పరిధిలోని మారుతి గార్డెన్ ప్రాంగణంలో సోమవారం సమాచార హక్కు చట్టానికి సంబంధించి వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. నాగారం మున్సిపల్ కమిషనర్ ఎస్.భాస్కర్ రెడ్డి అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ..."సమాచార హక్కు చట్టం అనేది ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే శక్తివంతమైన సాధనం. ప్రభుత్వ కార్యక్రమాలు, పాలనపై ప్రజలకు పూర్తి సమాచారం అందించే అవకాశం ఈ చట్టం ద్వారా లభిస్తోందని,పారదర్శక పాలనను సాధించేందుకు ప్రతి పౌరుడు ఈ హక్కును వినియోగించుకోవాలి," అని ఆయన తెలిపారు.

అనంతరం అధికారుల మధ్య చర్చా వేదిక ఏర్పాటు చేయగా, ప్రజల్లో సమాచార హక్కు చైతన్యాన్ని పెంపొందించేందుకు చేపట్టాల్సిన చర్యలపై అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. పౌరులతో ప్రత్యక్షంగా చర్చించి, వారి సందేహాలను నివృత్తి చేశారు.




అనంతరం కార్యక్రమం ముగింపు సందర్భంగా సమాచార హక్కు చట్టంపై కర పత్రాలు పంపిణీ చేయడంతో పాటు, హెల్ప్‌లైన్ నంబర్లు,అప్లికేషన్ ప్రక్రియలపై ప్రజలకు అవగాహన కల్పించబడింది. కార్యక్రమం స్ఫూర్తిదాయకంగా ముగిసిందని కమిషనర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు,

మున్సిపల్ మేనేజర్ నారాయణ రెడ్డి,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంతోష్ కుమార్,రెవెన్యూ ఆఫీసర్ బి.నాగేశ్వర రావు,బి.సురేష్ రెడ్డి,రెవెన్యూ ఇన్స్పెక్టర్ సాయి రాజ్, సానిటరీ ఇన్స్పెక్టర్ ఎ.బాబు,

ఎంవిరాన్మెంటల్ ఇంజనీర్ బి. శ్రవణ్ కుమార్,సిసి ఆర్. నిఖిలేశ్వర్,అన్ని వార్డుల వార్డు అధికారులు, కార్యాలయ సిబ్బంది, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నితిన్ హాస్పటల్ డాక్టర్ నిర్లక్ష్యంతో ఒక్క నిండు ప్రాణం బలి

**కీసర, అక్టోబర్ 13,(అక్షర గళం) :** మేడ్చల్ జిల్లా కీసర మండల పరిధిలో నితిన్ హాస్పటల్ డాక్టర్ నిర్లక్ష్యనికి ఒక్క నిండు ప్రాణం కోల్పోయిన మహేష్ యాదవ్.వివరాలు ప్రకారం ఆదివారం కీసర బొడ్రాయి పండుగ ఉన్న నేపథ్యంలో బంధువుల ఇంటికి వచ్చిన మహేష్ యాదవ్.

సాయంత్రం ఆరోగ్యం బాగాలేదు అని స్థానికంగా ఉన్న నితిన్ హాస్పటల్ కి చికిత్స



నిమిత్తం వెళ్ళిన మహేష్.

డాక్టర్స్ మహేష్‌కి ఇజంక్షన్స్ ఇచ్చి ట్రీట్ మెంట్ చేశారు.చికిత్స చేసిన అనంతరం మహేష్ నోటి మాటలు రాకపోవడంతో ఇక్కడి నుండి తీసుకెళ్లండి అంటూ అర్జెంట్ అంటూ హుటాహుటిన నాగారం విజయ్ హాస్పిటల్ కి తరలించగా మార్గ మధ్యలోనే మహేష్ యాదవ్ మృతి చెందాడు.ఇంజెక్షన్స్ ఇచ్చిన అనంతరమే మహేష్ యాదవ్ మృతి చెందినట్టు అనుమానంతో మృతుడి బంధువులు హాస్పటల్ ముందు ఆందోళనకు దిగారు.నితిన్ హాస్పటల్ లోని ఫర్నిచర్ ఏసీ ద్వాసం చేశారు.డాక్టర్స్ నిర్లక్ష్యంతోనే మహేష్ యాదవ్ మృతి చెందినట్టు ఆరోపిస్తున్న మహేష్ బంధువులు.సంఘటన స్థలానికి వచ్చిన పోలీసులు కిలో మీటర్ మేర ట్రాఫిక్ జామ్.పోలీసులు ఎంత చెప్పిన వినని మహేష్ బంధువులు.మృతుడి స్వస్థలం యాదాద్రి జిల్లా పగిడిపల్లి హాస్పటల్ ఫర్నిచర్ ధ్వంసం చేసిన మహేష్ బంధువులు...





# ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో లేకుండా ప్రత్యేక దృష్టి సారించాలి

### మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ ఐ మిక్కిలినేని మను చౌదరి

**మేడ్చల్ ప్రతినిధి, అక్టోబర్ 13, (అక్షర గళం):** ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో లేకుండా ప్రత్యేక దృష్టి సారించాలని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మిక్కినినేని మను చౌదరి అన్నారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాధికగుప్తా,డి. విజయేందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి జె.ఎల్.బి. హరిప్రియలతో కలసి కలెక్టర్ ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సమర్పించిన అర్జీలపై సత్వరమే స్పందించాలన్నారు. ప్రజల సమస్యలతో సమర్పించిన అర్జీలపై అధికారులు సత్వరమే స్పందించి, వాటిని పరిష్కరించుటకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన అర్జీలను అధికారులు క్షుణ్ణంగా పరిశీ లించి, తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజల వద్ద నుండి దరఖాస్తులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకుని , దరఖాస్తుల పై ఎండార్స్మెంట్ చేసి సంబంధిత శాఖల అధికారులకు సమర్పించారు.

ప్రజలకు ప్రజావాణి నిర్వహణపై నమ్మకం కల్పించే బాధ్యత అధికారులపై ఉందని ఆయన తెలిపారు. స్వీకరించిన అర్జీలకూ అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. పెండింగ్ లో ఉన్న అర్జీలపై జాప్యం లేకుండా ప్రత్యేక దృష్టి సారించి, త్వరగా పరిష్కరించాలని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్ లో వచ్చిన దరఖాస్తుల పై అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించి పెండింగ్ లేకుండా చూడాలని, అదేవిధంగా తిరస్కరించే ధరఖాస్తులకుగాను అర్జీదారులకులకు తగు కారణాలు తెలపాలని ఆయన సూచించారు.

ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రజావాణి యొక్క ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ప్రజావాణిలో 81 అర్జీలు వచ్చాయని, అందులో ఇందిరమ్మ ఇండ్లు, రెవెన్యూ, వైద్య ఆరోగ్యశాఖ, విద్యా, పౌరసరఫరాల శాఖ, ఇతర శాఖలకు సంబంధించి దరఖాస్తులు వచ్చాయని ఆయన పేర్కొన్నారు.ఈ ప్రజావాణిలో వివిధ శాఖల జిల్లా అధికారులు, అర్జీదారులు, తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఓటు చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం..

**కల్వకుర్తి, అక్టోబర్ 13(అక్షరగళం):** ఏఐసీసీ టీపీసీసీ ఆదేశాల మేరకు ఓటు చోరీకి వ్యతిరేకంగా మంగళవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో కల్వకుర్తి వెల్దండ చారగొండ మండలాలలోని అన్ని గ్రామాలలో ఓటు చోరీ అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్తామని కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయతి విజయ్ కుమార్ రెడ్డి సోమవారం మీడియాకు తెలిపారు. ఓటు చోరీకి పాల్పడిన దేశంలో బిజెపి గద్దెనెక్కిందని మోడీ పాలనలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని బిజెపి ప్రభుత్వం వ్యవస్థలను దుర్వినియోగం చేస్తుందని ఆరోపించారు. లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఓటు చోరీకి సంబంధించిన ఆధారాలను బయటపెట్టిన ఎలక్షన్ కమిషన్ చర్యలు తీసుకోకుండా బిజెపి కనుసైగల్లో ఎన్నికల సంఘం పనిచేస్తుందని మండిపడ్డారు. ఓటు చోరీకి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా భారత రాజ్యాంగం కనిపించిన ఓటు హక్కు కాపాడుకునే ప్రయత్నం అందరం సంతకాలు చేసి ఓటు చోరికి వ్యతిరేకంగా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ప్రతి గ్రామం నుండి ఓటు చోరీకి వ్యతిరేకంగా వందమందికి తగ్గకుండా సంతకాల సేకరణ చేపట్టాలని సంతకాల సేకరణ కార్యక్రమంలో స్వయంగా పాల్గొనాలని కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితీ విజయ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు.




# పూరణ్ కుమార్ ఆత్మహత్య దారుణం

### నిందితులపై చర్యలు తీసుకోకపోవడం ఆందోళన కలిగిస్తోంది
### ప్రధాని, హెూంమంత్రి రాజ్యాంగ బాధ్యతను నిర్వర్తించాలి
### ఈ సంఘటన మానవ హక్కుల ఉల్లంఘన
### చండీగఢ్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**చండీగఢ్,అక్టోబర్ 13(అక్షరగళం):** తెలంగాణకు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి వై.పూరన్ కుమార్ మరణం నన్ను తీవ్రంగా బాధించింది. ఇది నిజంగా చాలా దురదృష్టకరమైన ఘటన అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం ఆయన ఇటీవల కుల వివక్ష భావన, ఉన్నతాధి కారుల మానసిక వేధింపుల నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడిన అడిషనల్ డీజీ పురణ్ కుమార్ కుటుంబాన్ని పరామర్శించారు.

ఈ సందర్భంగా కుమార్ భార్య అమ్నీత్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోన్లో పరామర్శించి సంఘీభావం తెలిపారు. కుమార్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు భరోసా ఇచ్చారు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్థానిక మీడియాతో మాట్లాడారు.

హరియాణాలో అదనపు డీజీగా పని చేసిన ఆయన, అత్యంత ప్రతిష్టాత్మకమైన 'రా' విభాగంలో కూడా సేవలందించారు అని తెలిపారు.



ఉత్తమ సేవలకుగాను రాష్ట్రపతి మెడళ్ళను కూడా అందుకున్న ప్రతిభావంతులు ఆయన. అలాంటి గొప్ప అధికారి ఈ నెల 7న ఆత్మహత్య చేసుకోవడం తీవ్రంగా కలచి వేసే అంశం అని డిప్యూటీ సీఎం ఆవేదన వ్యక్తం చేశారు.అంతకుముందు ఆయన రాసిన ,మరణ వాగ్మూలం (సూసైడ్ నోట్)లో డీజీపీ కపూర్, ఎస్పీ నరేంద్ర అనే ఇద్దరు అధికారులు తనను అడుగడుగునా అవమానించి, వేధించడం వల్లే చనిపోతున్నానని స్పష్టంగా పేర్కొన్నారు అని తెలిపారు. చట్టం ప్రకారం ఇలాంటి సాక్ష్యం ఉన్నప్పుడు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి కదా అన్నారు. అయితే, రోజులు ఏడు రోజులు గడుస్తున్నా హర్యానా ప్రభుత్వం, చండీగఢ్ పోలీసులు నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది అని డిప్యూటీ సీఎం తెలిపారు.

ఆయన శవపరీక్ష కూడా జరగలేదు. ఆయన మృతదేహానికి ఇప్పటికీ పోస్ట్‌మార్టం కూడా చేయకపోవడం, వృద్ధురాలైన ఆయన తల్లికి, భార్యకు, కూతుళ్లకు కనీశం శవాన్ని చూడటానికి కూడా అనుమతించకపోవడం అత్యంత అమానుషం, దారుణం అన్నారు. ఇది మౌలిక మానవ హక్కుల ఉల్లంఘన. నిందితులలో ఒకరైన మిస్టర్ కపూర్‌పై అప్పటికే కులవివక్ష ఆరోపణలు ఉన్నా, ఆయనను ప్రభుత్వం డీజీపీగా కొనసాగించడం సిగ్గుచేటు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వందేళ్లు దాటిన మనిషి కూడా మరింతకాలం బతకాలి అనే కోరుకుంటాడు. చావుబ్రతుకుల్లో హాస్పిటల్ బెడ్డు మీద ఉన్నవారు కూడా 'మాకు బతకాలని ఉంది... మమ్మల్ని కాపాడండి' అని వైద్యులను వేడుకొంటారు.

అలాంటిది ఒక ఐపీఎస్ స్థాయి అధికారి ఇక నేను బతకలేను అని చెప్పిప్రాణం తీసుకున్నారంటే ఆయన ఎంత వేదన అనుభవించి ఉంటారో, ఎంత కష్టం ఆయనకు కలిగి ఉంటుందో ఊహించండి అని డిప్యూటీ సీఎం వివరించారు. ఆయన ఎంతటి అవమానం అనుభ



వించారో అర్థం ఒక ఐపీఎస్ అధికారికే రక్షణ లేకపోతే ఇక సాధారణ ప్రజల గతి ఏమిటో ఆలోచించండి అన్నారు. మానవ హక్కుల సంఘాలు, పౌర సంఘాలు గడచిన వారం రోజులుగా న్యాయం కావాలని పోరాడుతున్నాయి. హర్యానా, చండీగఢ్ రెండూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పరిధిలో ఉన్నాయి. కాబట్టి ప్రధాని, హెూం మంత్రి తమ రాజ్యాంగ బాధ్యతను నిర్వర్తించాలి అని డిమాండ్ చేశారు.

మా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విషయం తెలిసిన వెంటనే పూరం కుమార్ కుటుంబ సభ్యులతో మాట్లాడి, వారికి సంఘీభావం తెలిపారు. నన్ను తక్షణమే బాధితులను కలవమని ఇక్కడికి పంపించారు. పూరన్ కుమార్ హైదరాబాద్‌లోని ఉస్మానియాలో ఇంజనీరింగ్, ఆ తరవాత ఐఐఎమ్‌లో ఉన్నత విద్యను అభ్యసించి, హర్యానాలో ఐపీఎస్ అధికారిగా సేవలు అందించారు. ఆయన చాలా ప్రతిభాశాలి. ఆయన



మరణం ఆయన కుటుంబానికి వ్యక్తిగతంగా పుదుకోలేని నష్టమే కాదు.. వ్యవస్థకు కూడా నష్టమే అన్నారు. ఇది రాజకీయ పార్టీల సమస్య కాదు. ఇది మానవ హక్కుల సమస్య ,ప్రతి ఒక్కరికి ఈ దేశంలో జీవించే హక్కు ఉంది. దానిని ఎవ్వరూ కాదనలేరని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇలాంటి అన్యాయాలను సహించదు. చూస్తూ ఊరుకోదు. పూరన్ కుమార్ సూసైడ్ నోట్‌లో పేర్కొన్న డీజీపీ కపూర్, ఎస్పీ నరేంద్రలను వెంటనే అరెస్ట్ చేసి, వారిని చట్టపరంగా విచారించాలి. డిప్యూటీ సీఎం వెంట ఏఐసిసి ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొప్పుల రాజు, చండీగఢ్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ లక్కీ, సంవిధాన్ కమిటీ చైర్మన్ డాక్టర్ వినయ్ తదితరులు ఉన్నారు.

# తుంగతుర్తికి దేవాదుల నీళ్లు

- 1000 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం
- ఎస్.ఆర్.ఎస్.పి నీటి సరఫరాకు కృషి
- కాలువలు,లైనింగ్ మరమ్మతులకు చర్యలు
- కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన రక్తతర్పణం కార్యక్రమంతోటే సూర్యాపేట జిల్లాకు ఎస్.ఆర్.ఎస్.పి నీరు
- ఎస్.ఆర్.ఎస్.పి ఫేస్-2 సాధించిన ఘనత దివంగత ఆర్.దామోదర్ రెడ్డిదే
- ఎస్.ఆర్ ఎస్.పి నీటికోసం ఆర్.దామోదర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ పోరాటాలు నిర్వహించింది
- అటువంటి నేత పేరు చరిత్రలోనే పదిలంగా ఉండేలా ఎస్.ఆర్.ఎస్.పి ఫేస్ 2 కు ఆర్.డి.ఆర్ పేరు
- మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి

**సూర్యాపేట,అక్టోబర్ 13(అక్షరగళం):** తుంగతుర్తి నియోజకవర్గానికి దేవాదుల నీరు అందించాలి అన్నదే కాంగ్రెస్ పార్టీ సంకల్పమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. అందుకు గాను 1000 కోట్ల అంచనా వ్యయం తో ప్రతిపాదనలు సిద్దమౌతున్నాయని ఆయన వెల్లడించారు. సూర్యాపేట జిల్లా అభివృద్ధికి అంకిత భావంతో కృషి చేస్తానని ఆయన అన్నారు.



జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఎంపికలో భాగంగా కార్యకర్తల అభిప్రాయాలను సేకరించేందుకు గాను సోమవారం రోజున సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

పార్టీ పరిశీలకుడు సారత్ రౌత్,కోదాడ శాసనసభ్యురాలు ఉత్తమ్ పద్మావతీ, డి.సి.సి అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్,స్థానిక మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఎస్.ఆర్.ఎస్.పి నీటి సరఫరాను క్రమబద్దీకరణ కు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అకుంఠిత దీక్షతో పని చేస్తుందన్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కట్టిన రోజున దాని సామర్థ్యం 112 టి.యం.సి లు ఉండగా,మట్టి,ఇసుక పేరుక పోవడంతో దాని సామర్థ్యం 80 టి.యం.సీలకు పడి పోవడంతో చివరి వరకు నీరు అందడం లేదని ఆయన చెప్పారు. దానికి తోడు కాలువలు,లైనింగ్ దెబ్బ తినడం కూడా నీటి సరఫరకు అంతరాయం ఏర్పడుతుందని ఆయన వివరించారు. ప్రస్తుత ప్రభుత్వం అన్ని అవాంతరాలను అధిగమించి సూర్యాపేట కు ఎస్.ఆర్.ఎస్.పి నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

అందులో భాగంగానే ఎస్.ఆర్.ఎస్.పి ప్రాజెక్టులో పూడిక తీత పనులకు ఉపక్రమించామని తద్వారా నీటి సామర్థ్యం పెంచాలి అన్నదే ప్రభుత్వ నిర్ణయమన్నారు. వాస్తవానికి సూర్యాపేట జిల్లాకు ఎస్.ఆర్.ఎస్.పి నీటిని రప్పించిన ఘనత దివంగత నేత మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి దే నని ఆయన కొనియాడారు.

దివంగత ముఖ్యమంత్రి వై. ఎస్.రాజశేఖర్ రెడ్డి పి.సి.సి అధ్యక్షుడుగా ఉన్న సమయంలో దివంగత నేత ఆర్.దామోదర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన రక్తతర్పణం కార్యక్రమంలో తామందరం పాల్గొన్న విషయాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తు చేశారు.

ఎస్.ఆర్.ఎస్.పి నీటి కోసం దామోదర్ రెడ్డి ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు,పోరాటాలు జరిగాయన్నారు.

అటువంటి మహానేత పేరు ఎస్.ఆర్.ఎస్.పి ఫేస్-2కు పెట్టాలంటూ నీటిపారుదల శాఖామంత్రి హెూదాలో తాను చేసిన ప్రతిపాదనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమోదం తెలిపరన్నారు. దివంగత నేత దామోదర్ రెడ్డి పేరు చరిత్రలోనే పదిలంగా నిలిచి పోయేలా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఆ మహానేత లేని లోటు పూడ్చ లేనిదని ఆయన ఆశయాలు ముందుకు తీసుకు పోవడానికి అందరి సహకారంతో కృషి చేస్తామన్నారు. సూర్యాపేట జిల్లా అభివృద్ధికి నిరంతరం పని చేస్తామన్నారు. నీటిపారుదల రంగాన్ని బలోపేతం చేసే సూర్యాపేట జిల్లాను సస్యశ్యామలం చెస్తామన్నారు. సూర్యాపేట జిల్లా మీదుగా పోతున్న జాతీయ రహదారిని ఆరు లైన్ లు గా విస్తరించిన ఘనత కాంగ్రెస్ పార్టీ దే నన్నారు. అదే క్రమంలో సూర్యాపేట జిల్లాకు రైలు మార్గం మంజూరు అయ్యిందని ఆయన వెల్లడించారు.

వానాకాలం ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం సన్నద్ధమైందని అందుకు పూర్తి ఏర్పాట్లు చేశామన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాగు అయిన మూడు పంటలు రికార్డ్ సృష్టించాయన్నారు. చరిత్రలోనే ముందెన్నడూ లేని రీతిలో 148.3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి సాదించామన్నారు. 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు గాను ప్రభుత్వం 24 వేల కోట్లు ఖర్చు చేయబోతోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు.

# సంపాదకీయం..

## ప్రైవేట్ రంగానికి దోచిపెట్టడమెందుకు?

ఆరోగ్యశ్రీ పేరుతో వేలకోట్లు తగులబెడుతున్న ప్రభుత్వాలు, ప్రజా వైద్యరంగాన్ని పటిష్టం చేసే ఆలోచనలు చేయడం లేదు. వైఎస్ హయంలో ఉమ్మడి ఎపిలో మొదలైన ఈ పథకం ద్వారా ప్రైవేట్ ఆస్పత్రులు బాగుపడుతున్నాయి. ఈ పథకం కింద పెట్టే ఖర్చుతో జిల్లాకో పది ఆస్పత్రులను నిర్మించవచ్చు. కానీ ప్రైవేట్ మాఫియా గుప్పిట్లో ఉన్న ప్రభుత్వాలు ఈ పథకం కోసం తగలేస్తున్నారు. ఫీజు రియంబర్స్‌మెంట్ కూడా ఇలాంటిదే. ఈ రెండు పథకాలు రాష్ట్రాల ఖజానాను కొల్లగొడుతున్నాయి. ఇకపోతే ప్రైవేట్ ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ కింద వైద్యాన్ని సెకండ్ గ్రేడ్ సిటిజన్ల కింద అందిస్తున్నారు. ఆస్పత్రులకు వెళ్లిన పేషెంట్లకు గౌరవప్రదమైన వైద్యం అందడం లేదు. ఈ పథకం కింద వచ్చే వారికి బిల్లులో మదింపు చేసి ఎక్కువ చూపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అలాగే వీరిని నాసిరకం మనుషులుగా ట్రీట్ చేస్తున్నారు.

ప్రత్యేక వార్డులు, ప్రత్యేకంగా ట్రీట్‌మెంట్ ఇస్తున్నారు. దీనిపై ఎవ్వరు కూడా అడగడం లేదు. డబ్బులు తీసుకోవడంలో ఏ మాత్రం తగ్గని ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యాలు, వైద్య చికిత్సలో మాత్రం డబ్బులున్న వారికి ఓ రకంగా, ఆరోగ్యశ్రీ కింద వచ్చే పేషెంట్‌లను మరోరకంగా ట్రీట్ చేస్తున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రాల్లో వైద్యరంగాన్ని బలోపేతం చేయాల్సింది. జనాభాకు తగ్గట్లుగా ఆస్పత్రులను నిర్మించి, ఆరోగ్యశ్రీ భారాన్ని తగ్గించాల్సిన అసవరం ఉంది. ఈ డబ్బులతో వందలాది ఆస్పత్రుల నిర్మాణం చేయవచ్చు. ఇకపోతే తెలంగాణలో నిర్మాణంలో ఉన్న ఆస్పత్రులను త్వరగా పూర్తి చేయాలి. ప్రైవేట్‌ను మంచి ఆస్పత్రులను అభివృద్ధి చేయాలి. ఎపిలో పిపిపి కింద ఆస్పత్రుల నిర్మాణం చేపట్టడం మంచి పరిణామం. వైద్య కళాశాలలను, ఆస్పత్రులను ఇదే తరహా అభివృద్ధి చేయాల్సిందే. దీనిపై నిజాలు తెలియకుండా విపక్ష వైసిపి నేతలు, దాని అధినేత జగన్ చేస్తున్న విమర్శల్లో అర్థం లేదు.ప్రభుత్వపరంగా వైద్య కళాశాలల ఏర్పాటుకు కేంద్రం నుంచి అనుమతులు తెస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిని పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం పేరిట ప్రైవేటుపరం చేస్తోందని వైసీపీ కొన్ని రోజులుగా విమర్శలు చేస్తోంది. పేదలకు వైద్యం అందకుండా చేస్తున్నారని విమర్శలు కురిపిస్తోంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు కావలసిన వైద్య కళాశాలలను ప్రభుత్వ, ప్రైవేటు మోడల్‌లో



నిర్మించాలన్న నిర్ణయం తీసుకునే ముందు అందుకు గల కారణాలను వివరించి ఉంటే ఈ పంచాయితీ వచ్చేది కాదు. నిజానికి వైద్య కళాశాలలు అందుబాటులో లేకపోవడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఏటా వేలాదిమంది విద్యార్థులు కోట్లాది రూపాయలను విదేశాలకు తగలేస్తున్నారు.అలా కాకుండా ఇక్కడే నాణ్యమైన వైద్యవిద్యను అందించ గలిగితే డబ్బు వృధాకాదు. అంతేకాకుండా వాటికి అనుబంధంగా ఆస్పత్రులను బలోపేతం చేయాల్సి ఉంది. ఫ్యాకల్టీని, వైద్యులను కూడా సిద్ధం చేసుకోవాలి. ఈ రకమైన ప్రయత్నాలు కూడా ప్రత్యామ్నాయంగా సాగాలి. వైద్య విద్యను బోధించే సిబ్బందిని సమకూర్చుకోకుండా కళాశాలలను ఏర్పాటు చేయడం సమర్థనీయం కూడా కాదు. సంక్షేమం పేరిట దుబారా ఖర్చు చేస్తున్న తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు విద్యా,వైద్యరంగాలను బలోపేతం చేసేందుకు అధిక నిధులను వెచ్చించాలి.. బడ్జెట్ కేటాయింపులు పెంచాలి. విద్య, వైద్య రంగాలపై ప్రభుత్వాలు భారీగా ఖర్చు చేస్తున్నప్పటికీ ప్రజలు ప్రైవేటు రంగం వైపే ఆకర్షితులవుతున్నారు. దీనిని కూడా ప్రభుత్వాలు అధ్యయనం చేయాలి. ప్రైవేటు రంగంలోని ఆస్పత్రుల్లో వైద్యంపైనే ప్రజలు మక్కువ పడుతున్నారు. గాంధీ, ఉస్మానియా, వరంగల్ ఎంజిఎం లాంటి ఆస్పత్రలకు వెళ్లాలనుకోవడం లేదు. గుంటూరు, విజయవాడ, తిరుపతిల్లో కూడా ఇలాంటి దుస్థితి ఉంది. ఈ ఆస్పత్రులను ముందుగా బలోపేతం చేయాలి. ప్రవైట్ ఆస్పత్రలుకు పోటీగా అన్నిరకాల వైద్యసేవలు, వైద్య సర్వీసులను అందుబాటులోకి తీసుకుని రావాలి. ప్రైవేట్ గుత్తాధిపత్యానికి తావు లేకుండా చేయగలిగితే పోటీతత్వం వల్ల ప్రజలకు మేలే జరుగుతుంది. విద్యా రంగంలో కూడా పోటీతత్వం పెరిగింది. తమ పిల్లలను పేరొందిన ప్రైవేటు విద్యా సంస్థల్లో చేర్చడానికే ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు బడుగు బలహీన వర్గాల పిల్లలకే పరిమితం అవుతున్నాయి. నిజానికి ప్రైవేటు రంగంలోని పాఠశాలల్లో ఇరుకు గదుల్లో చదువు చెబుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు విశాలమైన క్రీడా మైదానాలు కూడా ఉన్నా ఆసక్తి కనిపించడం లేదు. అధిక జీతాలతో ఉపాధ్యాయులను నియమిస్తున్నా..కూడా ఫలితం కానరావడం లేదు. ఈ క్రమంలో ప్రైవేట్‌లో చదివే విద్యార్థులకు ఇంజనీరింగ్‌లో ఫీజు రియంబర్స్‌మెంట్ ఇవ్వడం న్యాయనం కాదు. దీనిపై ప్రభుత్వాలు ఆలోచనలు చేయాలి. విద్య, వైద్య రంగాలపై వేల కోట్లు ఖర్చు చేస్తున్నప్పటికీ ఫలితం మాత్రం అంతంత మాత్రంగానే ఉంటోంది. అంటే సక్రమంగా నిధుల వెచ్చింపు జరగడం లేదని గుర్తించాలి. అరకొర సౌకర్యాలే ఉన్నప్పటికీ ప్రైవేటు విద్యా సంస్థల వైపే ప్రజలు మొగ్గు చూపుతున్నారు. మెరుగైన విద్య, వైద్యం ఇతర సౌకర్యాల కోసం ప్రభుత్వాలు తమ ప్రాధాన్యం పెంచాలి. విద్య, వైద్య రంగాలలో కూడా ప్రభుత్వ సంస్థలు ప్రైవేటు రంగంతో పోటీ పడేలా చేయాలి. ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో నమ్మకం పోతోందనడానికి ప్రైవేట్ పోటీ పెరగడమే. ప్రభుత్వ రంగంలో ఆస్పత్రులను తీర్చిదిద్దితే ఆరోగ్యశ్రీ లాంటి పథకాలు అవసరం ఉండదు. ప్రభుత్వ విద్యా,వైద్యరంగంలో జవాబుదారీతనం కూడా తీసుకుని రావాలి. వీటిపై అజమాయిషీ కూడా పెంచాలి. అరకొర సౌకర్యాలు ఉన్న ప్రైవేటు ఆస్పత్రులు కూడా బాగానే నడుస్తున్నాయి. అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ ప్రభుత్వ ఆస్పత్రులు ప్రజల్లో విశ్వాసం కల్పించలేకపోతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం సిబ్బందిలో జవాబుదారీతనం లేకపోవడమే. ఆస్పత్రులైనా, కళాశాలలైనా నిపుణులైన ఫ్యాకల్టీ ఉన్నప్పుడే వాటిపై ప్రజలకు నమ్మకం కలుగుతుంది. పేరొందిన డాక్టర్లతోనే వైద్యం చేయించుకోవాలని ఎవరైనా కోరుకుంటారు. అలానే సరైన ఫ్యాకల్టీ ఉన్న వైద్య కళాశాలల్లో చేరడానికే విద్యార్థులు ఆసక్తి చూపుతారు. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తీసుకువచ్చిన ఫీజుల చెల్లింపు పథకం ఫలితంగా ఇంజనీరింగ్ కళాశాలలు పుట్టగొడుగుల్లా ఏర్పడ్డాయి. ఫలితంగా రెండు రకాలుగా నష్టం జరిగింది. ఇంజనీరింగ్ విద్య నాణ్యత దెబ్బతింది. ఆయా కళాశాలలు మూతపడ్డాయి. నాణ్యతలేని ఇంజనీరింగ్ విద్యను అభ్యసించిన వేల, లక్షల మంది ఇంజనీరింగ్ పట్టభద్రులు నిరుద్యోగులుగా మన కళ్ల ముందే కనిపిస్తున్నారు. ఇంజనీరింగ్ విద్యతో పోలిస్తే వైద్య విద్యలో ఫ్యాకల్టీ ప్రాధాన్యం అధికంగా ఉంటుంది. ఇదే విషయాన్ని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి పదేపదే చెబుతున్నారు. దీనిని సాకారం చేయాల్సి ఉంది. తెలుగునాట ఇద్దరు సిఎంలు కూడా ఈ రెండు రంగాలను పట్టాలకెక్కించాల్సిందే. ఆరోగ్యశ్రీ, ఫీజు రియంబర్స్‌మెంట్‌లతో పనిలేకుండా చేయగలగాలి. అప్పుడే రాష్ట్రాలు పురోగమిస్తాయి.

## టూరిజం కారిడార్‌పై సీఎం చంద్రబాబు ఫోకస్

టూరిజం కారిడార్‌పై సీఎం చంద్రబాబు ఫోకస్ పెట్టారని మంత్రి టీజీ భరత్ తెలిపారు. అనంతపూర్, కర్నూలు ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. శ్రీశైలంలో ఫైవ్ స్టార్ హోటల్ నిర్మాణం కానుందని చెప్పారు. ప్రధాని మోదీ వస్తున్నందున చాలా అంచనాలు ఉన్నాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. నాటి రాజధాని కర్నూలుపై ప్రధాని మోదీకి అవగాహన ఉంటుందని చెప్పారు. కర్నూలుకి మోదీ వరం ఇస్తారని తాను ఆశిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. జిఎస్టీ తగ్గింపుతో ప్రజలకు చాలా మేలు జరిగిందని హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ పర్యటనను ప్రజలు విజయవంతం చేయాలని మంత్రి టీజీ భరత్ కోరారు. ప్రధాని మోదీ రాక కోసం కూటమి ప్రభుత్వం భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నట్లు టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. ప్రధాని సభను కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. కడపలో మహానాడు.. అనంతపురంలో సూపర్ సిక్స్ సభలు సక్సెస్ అయ్యాయని హర్షం వ్యక్తం చేశారు. కర్నూలును డ్రోన్ హబ్‌గా కూటమి ప్రభుత్వం మార్చనుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు సమాంతర అభివృద్ధి జరగాలన్నదే సీఎం చంద్రబాబు ఆకాంక్ష అని వివరించారు. కూటమి సర్కారు అన్ని జిల్లాల అభివృద్ధికి కృషి చేస్తోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. వీరంతా ప్రధాని రాక సందర్భంగా ఏర్పాట్లు పరిశీలించారు. 16న ప్రధాని పర్యటించే ప్రాంతాలను పరిశీలించి, అధికారులతో సమీక్షించారు.

# ప్రపంచంలోనే అద్భుత నగరిగా అమరావతి

దేశంలోనే కాకుండా ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా అత్యద్భుత నరగంగా అమరావతి రాజధాని నిర్మాణం కాబోతున్నదని సిఎం చంద్రబాబు అన్నారు. దేవతల రాజధాని అమరావతి ఎలా ఉంటుందో కానీ, మన రాజధాని అమరావతి అంతకుమించి ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇది కేవలం రాజధాని మాత్రమే కాదని, మనభవిష్యత్ ఆశలకు తార్కాణంగా ఉంటుందన్నారు. అలాగే రాజధాని అమరావతి ప్రాంత రైతుల త్యాగాలను ఎప్పటికీ మరువనని సీఎం చంద్రబాబు అన్నారు. భూములు ఇచ్చిన రైతుల అవస్థలు చూశానని.. రోడ్డెక్కి ఉద్యమాలు చేశారని గుర్తుచేశారు. రాజధాని ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. అమరావతిలో సీఆర్డీఏ కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించిన అనంతరం సీఎం మాట్లాడారు. ఇవాళ చాలా ఆనందంగా ఉంది. మొదటిగా సీఆర్డీఏ భవనం ప్రారంభమైంది. తొలిసారి ల్యాండ్ పూలింగ్ కింద భూములిచ్చిన చరిత్ర అమరావతి రైతులది. రాబోయే రోజుల్లో ప్రభుత్వ, ప్రైవేటు భవనాలు వస్తాయి. రాష్ట్ర విభజన జరిగినప్పుడు రాజధాని కూడా లేని పరిస్థితిలో విభజన జరిగింది. రాజధాని ఎక్కడో చెప్పకుండా అప్పటి కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విభజన చేసింది. రాష్ట్ర భవిష్యత్తుకు ఉపయోగపడేలా.. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా నిర్మించాలని ఆనాడు నిర్ణయం తీసుకున్నాం. విజయవాడ-గుంటూరు మధ్యలో రాజధాని ఉంటే బాగుంటుందని నిర్ణయించాం. అప్పటికే ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్ తయారు చేశాం. రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చేందుకు రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. ప్రపంచ చరిత్రలో ఇంత పెద్ద మొత్తంలో భూసమీకరణ జరిగింది ఒక్క అమరావతిలోనే. గతంలో హైటెక్ సిటీ నిర్మించినప్పుడు నా విజన్ చెబితే అవహేళన చేశారు. హైదరాబాద్‌లో 5 వేల ఎకరాల్లో ఎయిర్‌పోర్టు నిర్మించాం. ఎయిర్‌పోర్టుకు భూమి ఇవ్వాలని ఆనాడు కోరితే రైతులు వెంటనే ఇచ్చారు. అక్కడ భూములు కొన్నవారు బ్రహ్మాండంగా బాగుపడ్డారని చంద్రబాబు అన్నారు. ఇప్పుడు ఇక్కడి రైతులు కూడా బాగుపడతారని హామీ ఇస్తున్నానని అన్నారు. రాజధాని రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ముగ్గురికి చంద్రబాబు బాధ్యతలు అప్పగించారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌కు అప్పగిస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఏ సమస్య ఉన్నా ఈ ముగ్గురు నేతలతో చెప్పి పరిష్కరించుకోవాలని సూచించారు. నేతలు సైతం తరచూ రైతులతో సమావేశాలు నిర్వహించాలని సీఎం ఆదేశించారు.రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి రాజధాని లేకుండా రాష్ట్రం ఏర్పడిందన్నారు. రాజధాని ఎక్కడ పెట్టాలో నిర్ణయించడానికి నాడు కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం కమిటీ వేసిందని తెలిపారు. రాజధాని ఎక్కడ పెట్టాలనే అంశాన్ని కూడా చెప్పకుండా విభజన చేశారని.. రాజధాని కోసం జాగా కూడా లేని పరిస్థితుల్లో రాష్ట్ర విభజన చేశారని అన్నారు. రాజధాని విషయంలో నాటి యూపీఏ ప్రభుత్వం లేనిపోని పంచాయితీ పెట్టిందని విమర్శించారు.




రాష్ట్రం మధ్యలో రాజధాని పెడితే అందరికీ బాగుంటుందని ఇక్కడ ఏర్పాటు చేశామని చెప్పారు. బెస్ట్ రాజధాని నిర్మిస్తున్నామని.. గ్రీన్ ఫీల్డ్ రాజధాని నిర్మిస్తున్నామని వెల్లడించారు. రాజధాని నిర్మాణానికి భూమి కావాలని.. ప్రణాళికలకు అనుగుణంగా రాజధాని నిర్మించగలరా అని అనుమానపడ్డారని అన్నారు. సైబరాబాద్ నిర్మించిన అనుభవంతో అమరావతి నిర్మాణం ప్రారంభించామని.. భూమి కోసం ఎదురు చూస్తున్న సమయంలో అమరావతి రైతులు తనకు దారి చూపారని సీఎం వెల్లడించారు. రైతులు ఐదు సంవత్సరాలు ఇబ్బందులు పడ్డారని.. రాజధాని వేశ్యల ప్రాంతమని మాట్లాడారని.. ఎడారి, స్మశానం అన్నారని మండిపడ్డారు. ఇంత మంచి ప్రాంతం ఎక్కడా ఉండదన్నారు. 30, 40 లక్షల ఎకరాలు సాగు చేసే నది కృష్ణా నది ఇక్కడ పారుతోందని, ప్రపంచంలో ఎక్కడా లేని సిటీ అమరావతి అని తెలిపారు. ఇక్కడ గ్రీనరీ అద్భుతంగా వస్తుందని.. ఇక్కడ బ్లూ , గ్రీన్ సిటీగా అమరావతి ఉంటుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గతంలో జరిగిన తప్పుకు మీరు, నేను, రాష్ట్ర ప్రజలు ఎంత అనుభవించారో చూశారు. ఇకపై ఎన్‌డీఏ ప్రభుత్వం శాశ్వతంగా ఉండాలి.

అమరావతి కన్నా విశాఖ ముందుకు వెళుతోంది. అమరావతికి శంకుస్థాపన సమయంలో పవిత్ర ప్రాంతాల నుంచి మట్టి నీరు తెచ్చారు. పార్లమెంట్ మట్టి, యమునా నది నీటిని ప్రధాని తెచ్చారు. అందుకే అమరావతి నిలిచింది. రైతులను నేను మరిచిపోను.. మరిచిపోతే త్యాగాన్ని మరిచిపోయినట్టే' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. అమరావతి నిర్మాణంతో ఆదాయం సృష్టిస్తుందన్నారు. హైదరాబాద్ ఇప్పుడు తెలంగాణకు 70శాతం ఆదాయాన్ని సమకూరుస్తోందని అన్నారు.

కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశాఖర్, మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

# పారదర్శకతే ఇసికి శ్రీరామరక్ష

బీహార్‌లో ఎన్నికల కమిషన్ చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఓటర్ల జాబితా కొన్ని వర్గాల్లో ఉపశమనం కలిగించినా, మరి కొన్ని వర్గాల్లో తీవ్ర అశాంతి రేకెత్తించింది. గత మంగళవారం విడుదలైన తుది జాబితా, సామూహికంగా ఓటర్ల తొలగింపు భయాలు మొదట్లో భయపడిన స్థాయిలో లేకపోయినా, ఈ ప్రక్రియ దేశంలో ఎన్నికల ప్రజాస్వామ్య భవిష్యత్ గురించి అత్యవసర ప్రశ్నలను లేవనెత్తింది. సుప్రీం కోర్టు జోక్యం ఎన్నికల కమిషన్ ను మరింత పారదర్శకత వైపు నడిపించగా, ప్రతిపక్షాలు అప్రమత్తమైన పాత్ర పోషించడంతో బీహార్ సర్ దారుణ ఫలితాలను తప్పించింది. కానీ ఈ కసరత్తు ఎన్నికల ప్రక్రియలను ఎలా ఆయుధంగా ఉపయోగించవచ్చో, భారతదేశం అంతటా ఇలాంటి సవరణలు చేపట్టే ముందు ఎలాంటి జాగ్రత్త చర్యలు తీసుకోవాలనే అంశంలో ఓ హెచ్చరిక కథగా మిగిలిపోయింది. ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపు సంఖ్యాపరంగా మాత్రమే ప్రమాదంలో పడలేదు. భారత ప్రజాస్వామ్య సమగ్రతే ప్రమాదంలోపడింది.ఓటర్ల జాబితా సవరణలో తలెత్తిన సమస్యలు, జాతీయ స్థాయిలో పునరావృతమైతే, సార్వత్రిక ఓటు హక్కు అనే అంశాన్నే అస్థిరతలో నెట్టివేయవచ్చు. ముఖ్యంగా దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు, వలసదారులు, పేదలను లక్ష్యంగా చేసుకుంటూ పాలక వర్గాల పట్టును మరింత బలోపేతం చేస్తుంది.

బీహార్‌లో చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అనేది ఓటర్ల జాబితాలను సంస్కరించడం, చనిపోయిన వారి పేర్లు, వలసపోయిన వారి పేర్లు, నకిలీ పేర్లను తొలగించే లక్ష్యం తో చేపట్టింది.అయినా రాజకీయం లోపాయికారిగా అంతర్గతంగా ఉంది. కేంద్ర ప్రభుత్వం, దాని అనుబంధ శక్తులు ఈ కసరత్తును అక్రమ వలసదారులు, చొరబాటుదారులు -ఘుస్పైటియాస్ - తొలగించే మార్గంగా చూపాయి. కానీ ఈ పదాలు ముఖ్యంగా మైనారిటీలు, ముఖ్యంగా ముస్లింలను లక్ష్యం చేసుకునే ఆయుధాలుగా ఉపయోగపడుతున్నాయి. మొదట్లో ఈ ప్రక్రియతో భారీ స్థాయిలో ఓటర్ల తొలగింపునకు దారితీస్తుందనే భయాలు ఉన్నాయి. బీహార్ ఓటర్ల జాబితాలో జూన్ నాటికి 7 కోట్ల 89 లక్షల మంది ఓటర్లు ఉండగా, అక్టోబర్‌లో ప్రచురించిన తుది జాబితాలో 7 కోట్ల 42 లక్షల మంది ఉన్నారు. అంటే దాదాపు 6 శాతం మందిని తొలగించారు. చనిపోయిన వారి పేర్లను, వలసదారులు, నకిలీల పేర్లు తొలగించామని అధికారులు వివరణ ఇచ్చారు. కానీ, 68.6 లక్షల మంది పేర్ల తొలగింపు ఆశ్చర్యాన్ని కలిగించింది. తీవ్ర పరిణామాలకు దారితీసింది. మెజారిటీ తొలగింపులు చట్టబద్ధమైనవే అయినా, బలహీనమైన డాక్యుమెంషన్‌లో పలువురి తొలగింపు వాస్తవమే.

బీహార్ కేసులో బహుళ శక్తుల జోక్యం వల్ల ఈ పరిస్థితి తలెత్తింది. సర్ చేపట్టిన సమయం, దాని ఫార్మెట్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు స్పందిస్తూ, ఆధార్ ను అందుబాటులో ఉన్న రుజువుగా చేర్చాలని ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. ప్రతిపక్షాలు వీటిలో అక్రమాలను ఎత్తిచూపుతూ, జోరుగా ప్రచారం చేపట్టాయి. మీడియా, కొన్ని సంస్థలు క్షేత్రస్థాయిలో పరిణామాలను వెలుగులోకి తెచ్చాయి. ఈ అప్రమత్తత లేకుంటే, మరికొందరి పేర్లు తొలగిపోయి ఉండేవి, అనర్థం జరిగేది. బీహార్ కేసుతో భారత ఎన్నికల కమిషన్ తీరుతెన్నుల విచికిత్స మొదలైంది. ఒకప్పుడు ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టే కోటగా పరిగణించిన ఎన్నికల కమిషన్‌ను ప్రతిపక్ష పార్టీలు, పౌర సమాజం అనుమానంతో చూస్తున్నాయి. ఈ మధ్యకాలంలో ఎన్నికల కమిషన్ అధికార పార్టీ ప్రయోజనాలకు కొమ్ముకాస్తోందని విమర్శకులు వాదిస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ ఖరారు, మోడల్ కోడ్ ఉల్లంఘనలపై చర్యల విషయంలో విముఖత చూపడం, ఓటర్ల జాబితా సవరణ వంటి కసరత్తులో పారదర్శకత లేని విధంగా చర్యలు చేపట్టడంతో అనుమానాలు హెచ్చాయి. బీహార్‌లో ఈ ప్రక్రియను ఇసి అధికారికంగా పర్యవేక్షిస్తున్నా, జవాబుదారీతనాన్ని నిర్ధారించేది కోర్టులు, ప్రతిపక్షమే. ఎన్నికల కమిషన్ వ్యవహార శైలి పలు ప్రశ్నలను లేవనెత్తుతుంది. నిష్పక్షపాతంగా ఉండాల్సిన సంస్థలో ఇతరులు జోక్యం చేసుకుని తటస్థతను ఎందుకు కాపాడాలి. ఓటర్ల హక్కులను కాపాడడంలో చురుగ్గా వ్యవహరించాల్సిన ఇసి ఎందుకు నిష్క్రియాత్మకంగా కన్పిస్తుంది. నమ్మకం, చట్టబద్ధత కలిగిన సంస్థ పక్షపాత ధోరణితో వ్యవహరించడం తీవ్ర హానికరం.

కేంద్రంలోనూ, రాష్ట్రాలలోని పాలక వర్గాలు ఇటువంటి కసరత్తును తమకు అనుకూలంగా మార్చుకోవాలన్న ఆలోచనే ఎంతో ప్రమాదకరం. మీకు మద్దతు ఇచ్చే అవకాశంలేని ఓటర్లను తొలగించడం లేదా నిరోధించడమే వాటి ఉద్దేశమై ఉంటుంది. బీహార్‌లో పేదవర్గాలు, వలసదారులు, ముస్లింలపై వేటు వేస్తారనే అనుమానాలు తలెత్తాయి. వారు అధికార పార్టీకి ఓటు వేసే అవకాశం తక్కువగా ఉండడమే కారణం. ఇదే నమూనా చాలా చోట్ల కన్పిస్తున్నది. ఉత్తరప్రదేశ్‌లో కొన్ని వర్గాల పేర్లు తొలగించారనే ఆరోపణలు అప్పుడప్పుడు తలెత్తుతున్నాయి. ఢిల్లీలో పాలక ప్రభుత్వం మైనారిటీలు అధికంగా ఉన్న ప్రాంతాలలో ఓటర్ల





జాబితాలలో మార్పులు చేర్పులు, చేస్తోందని ప్రతిపక్ష పార్టీలు ఆరోపించాయి.

అసోంలో ఈ వ్యూహం మరింత ఎక్కువ. జాతీయ పౌరుల రిజిస్టర్ (ఎన్ఆర్‌సి) ప్రక్రియ, తర్వాత రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాలు కేవలం ఓటర్ల పేర్లను తొలగించే విస్తృత ఎజెండాను ప్రతిబింబించాయి. ముఖ్యంగా ముస్లింలు, అదీ బెంగాలీ మూలాలు కలిగిన ముస్లింలు టార్గెట్ అయ్యారు. దశాబ్దాలుగా నివసిస్తున్న భూముల నుంచి పెద్ద సంఖ్యలో బహిష్కరణకు గురయ్యారు. కీలక డాక్యుమెంట్లు ఉన్నా వారిని తరచు ఆక్రమణదారులుగా ముద్రవేశారు. ఒకసారి భూమిని విడిచి పెడితే వారు తమ శాశ్వత చిరునామా నిరూపించుకునే అవకాశం లేదు. ఓటర్ల జాబితాలో పేర్లు ఉండాలంటే ఇది తప్పనిసరి. ఉద్దేశపూర్వకంగానే తొలగింపు, హక్కుల తొలగింపు సాగుతున్నాయి. మొదట గృహ స్థిరత్వాన్ని తరస్కరించడం, ఆ తర్వాత ఓటింగ్ హక్కులను తిరస్కరించడం. బీహార్‌లో ఓటర్ల జాబితాల సవరణకు చేపట్టిన సర్.. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాల సవరణకు మోడల్‌గా మారితే ఈ వ్యూహాలే భారీస్థాయిలో సంస్థాగతం అయ్యే ప్రమాదం ఉంది. బీహార్‌లో- సర్- ఓటర్ల జాబితా సవరించే ప్రక్రియగా మొదలై పౌరసత్వ పరీక్షగా ఎలా మారిందో మీడియాలో ఓ వర్గం సరిగ్గానే ఊహించింది. ఇది అసోంలో ఎన్ఆర్ సిని ప్రతిబింబిస్తోంది. సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని తదుపరి చర్యలు నిలిపివేయకుంటే, దాదాపు 19 లక్షల మంది గల్లంతు అయిపోయేవారే. రెండు సందర్భాలలోనూ అసలు కీలకం ఒక్క. ఓటరే తాను పౌరుడని రుజువు చేసుకోవాలి. లేని పక్షంలో కమిషన్ డాక్యుమెంటరీ సాక్ష్యాలను కోరుతుంది. పేదలకు అలాంటి ఆధారాలు ఏవీ ఉండవు. బీహార్‌లో ఆమోదయోగ్యమైన డాక్యుమెంట్‌లలో ఆధార్ ను చేర్చడం ఓ ఊరట. అంతమాత్రాన అధికార బహిష్కరణ ప్రమాదం తొలగిపోదు. ప్రస్తుతం అనుసరిస్తున్న విధానం సార్వత్రిక వయోజన ఓటు హక్కు అనే ప్రాథమిక సూత్రాన్ని బలహీనపరుస్తోంది. అది షరతులతో కూడిన ఓటు హక్కుగా మారుస్తోంది. బీహార్ నమూనాను దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాలకు విస్తరించడం పెను ప్రమాదం కాగలదు. భారత దేశంలో 97 కోట్ల మంది నమోదు చేసుకున్న ఓటర్లు ఉన్నారు. చిన్న స్థాయిలో 5శాతం మంది పేర్లను తప్పుడు ఓటర్లుగా ముద్ర వేసి తొలగించినా ఐదు కోట్ల మంది పౌరులు ఓటు హక్కు కోల్పోతారు. ఇది అనేక దేశాల్లో ఓటర్ల సంఖ్య కన్నా ఎక్కువ. ఓటర్ల తొలగింపు అన్నది సామాజిక భౌగోళికంగా కూడా ముఖ్యమైంది. వలస కార్మికులు, పట్టణ పేదలు, భూమిలేని రైతులు, దళితులు, ఆదివాసీలు, ముస్లింలు ఎక్కువగా ప్రమాదంలో ఉన్నారు. ఈ వర్గాలు ఇప్పటికే వ్యవస్థపరంగా ఎన్నో అడ్డంకులు ఎదుర్కొంటున్నాయి. పేదరికం, స్థానభ్రంశం, డాక్యుమెంషన్ లేకపోవడంతోపాటు ఎన్నికల హక్కు తొలగిస్తే, వారు రాజకీయంగా కూడా లేకుండాపోతారు. అక్రమ వలసదారుల కథనం అసోం, సరిహద్దు రాష్ట్రాలకే పరిమితం అయ్యే అవకాశం లేదు. రాజకీయాలు మరింత ముదిరి పాలక వ్యవస్థలు తమను విమర్శించే వర్గాలపై ఈ గొడ్డలి ఉపయోగించవచ్చు. ఎన్నికల కమిషన్ విశ్వసనీయతను పునరుద్ధరించుకోవాలి. ప్రజాస్వామ్యానికి నిష్పాక్షికతతో కూడిన సంరక్షకుడిగా వ్యవహరించాలి. అందుకు అనేక చర్యలు చేపట్టడమే తక్షణ కర్తవ్యం. 1. ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపులో పారదర్శకత ప్రదర్శించాలి. ప్రతి తొలగింపుపై బహిరంగంగా వివరణ ఇవ్వాలి. అప్పీల్ చేసుకునే అవకాశం ఇవ్వాలి. 2. స్వతంత్ర పర్యవేక్షణ- ఓటర్ల జాబితా సవరణ పర్యవేక్షణలో పౌరసమాజ సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు. స్వతంత్ర పరిశీలకులు అధికారికంగా పాల్గొనే అవకాశం కల్పించాలి. 3. చట్టపరమైన రక్షణలు కల్పించాలి,- ఓటర్ల జాబితా సవరణపై పార్లమెంటులో స్పష్టమైన పరిమితులను చట్టబద్ధం చేయాలి. ఏకపక్షంగా తొలగింపు ఉండరాదు. 4. డిజిటల్ జవాబుదారీతనం -సాంకేతికతను బాధ్యతాయుతంగా ఉపయోగించాలి. ఆధార్ ఇతర డేటా బేస్ లు అడ్డంకులు కాకుండా సులభతరం చేయాలి. 5. ప్రజా విశ్వాసం -ఎన్నికల కమిషన్ నిష్పాక్షికంగా వ్యవహరిస్తోందని కనబడాలి, మోడల్ కోడ్ ఉల్లంఘించిన వారిని శిక్షించడంలో సమానత్వం పాటించడం, అన్ని పార్టీలను సంప్రదించడం, ఓటర్ల చేరికకు ప్రాధాన్యం ఇవ్వడం వంటి వి పారదర్శకంగా సాగాలి. ఓటర్ల జాబితాపై పోరాటం కేవలం పరిపాలనాపరమైనది కాదు. అస్తిత్వానికి సంబంధించినది. కులం, మతం, వర్గం లింగ భేదం లేకుండా ప్రతి వయోజనుడికి ఓటు హక్కు కల్పించాలన్న సూత్రం భారత ప్రజాస్వామ్యానికి కీలకం, ఏకపక్షంగా ఓటర్ల తొలగింపు ఈ హక్కును నీరుగార్చడం, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. బీహార్ అనుభవం రానున్న ముప్పును, అవకాశాలను రెండింటినీ చూపుతోంది. అడ్డుఆపూ లేకుండా సర్ నిర్వహిస్తే లక్షలాది మంది ఓటు హక్కు కోల్పోతారు. బీహార్ సర్ నిర్వహణ విషయంలో ప్రతిపక్షల అప్రమత్తత, న్యాయవ్యవస్థ జోక్యం, మీడియా పర్యవేక్షణ దిద్దుబాటుకు తోడ్పడ్డాయి. ఎన్నికల కమిషన్ స్వతంత్ర ప్రతిపత్తికి ఇవి ప్రత్యామ్నాయం కావు. భారతదేశం అంతటా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లాంటి సవరణలను విస్తరించేందుకు సిద్ధమవుతున్న ఎన్నికల కమిషన్‌కు బీహార్ పాఠాలు హెచ్చరిక కావాలి. ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా చర్య తీసుకోవల్సిన సమయం ఆసన్నమైంది. ఇసి తన స్వతంత్ర, న్యాయమైన వారసత్వాన్ని నిపులుకోవాలి. పౌర సమాజం, రాజకీయ ప్రతిపక్షం అప్రమత్తం కావాలి. బ్యాలెట్‌పై నమ్మకం లేకుంటే ప్రజాస్వామ్యానికి మనుగడలేదు.



**ప్రియాంకా చోప్రా – నిక్‌జోన్స్, దీపికా పదుకొనే – రణ్‌వీర్‌సింగ్, ఇషా అంబానీ – ఆకాశ్....**

**ఇలా ప్రముఖులందరూ డెస్టినేషన్ వెడ్డింగ్ బాట పట్టారు. ఖర్చు పెట్టే సామర్థ్యం ఉన్నవాళ్లందరూ గోవా, జోధ్‌పూర్, ఉదయపూర్, ఇటలీలోని లేక్ కోమో లాంటి రకరకాల చోట్లకు క్యూ కడుతున్నారు. కొత్తగా ఆలోచిస్తే, మీ డెస్టినేషన్ వెడ్డినేషన్‌ను మరింత విభిన్నంగా ప్లాన్ చేసుకోవచ్చు. అలాంటి హార్ట్‌బీట్ పెంచే ఆఫ్‌బీట్ వెడ్డింగ్ డెస్టినేషన్స్‌లో కొన్నిటి గురించి....**



# అక్కడ పెళ్ళి చేసేద్దాం... కలిసివెళ్ళి

## హిమాలయాల సాక్షిగా.....

అరుణాచల్ ప్రదేశ్‌లోని తవాంగ్ పట్టణం ఇప్పుడిప్పుడే పెళ్లి వేడుకలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది. ఎప్పటినుంచో హనీమూన్ డెస్టినేషన్‌గా కూడా నూతన వధూవరులకు ఇష్టమైన ప్రదేశం ఇది. హిమాలయ పర్వతాల సోయగాలను వీక్షిస్తూ, ఆ ప్రకృతి ఒడిలో కొత్త జీవితానికి స్వాగతం పలకాలనుకునేవారికి ఇది సరైన ఛాయిస్. పెళ్లి వేడుకల కోసం ఇక్కడ చాలా రిసార్టులు అందుబాటులో ఉన్నాయి.

**ఎలా వెళ్లాలి:** కోలకతా నుంచి రోడ్డు, విమానమార్గాల్లో వెళ్లవచ్చు. గౌహతిలోని లోకనాథ్‌ప్రియ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి 480 కి.మీ దూరంలో ఉంది. ఏప్రిల్ నుంచి అక్టోబర్ నెల వరకు ఈ ప్రాంతం పర్యాటకానికి అనువుగా ఉంటుంది.

## ఆ ద్రాక్షతోటల్లో...

ఆ ఇద్దరూ కాబోయే దంపతులు. చుట్టూ ఎంతో మంది అతిథులు. సరిగ్గా సూర్యాస్తమయం అవుతోంది. ఆ అరుణ కిరణాలు వారి మీద పడుతున్నాయి. ఈ క్షణం కోసమే వారందరూ ఎదురుచూస్తున్నారు. అప్పుడే ఒకటయ్యారు. అప్పటి నుంచి ఫోటోలు క్లిక్‌మంటూనే ఉన్నాయి. జీవితంలోని ఈ అపురూప ఘట్టానికి ఇంతకుమించిన అందాల వేదిక ఎక్కడ ఉంటుంది? చాలా మంది ఇటలీలోని వైన్‌యార్డులను ఎంచుకుంటారు. అయితే ఎక్కడో విదేశాల దాకా వెళ్లక్కర్లేదు. మహారాష్ట్రలోని నాసిక్‌లోని వైన్‌యార్డ్స్ ఇప్పుడు ఆఫ్‌బీట్ డెస్టినేషన్‌గా ఖ్యాతి చెందాయి. సకల వసతి సౌకర్యాలు ఉంటాయి. వినోదానికి ఏ మాత్రం ఢోకా ఉండదు.

ఎలా వెళ్లాలి: ముంబయి నుంచి 171 కి.మీ. అక్కడ నుంచి అయిదు గంటల ప్రయాణం.

ఖర్చెంత: 500 నుంచి 2000 మంది ఒకేసారి పాల్గొనే అవకాశం ఉంటుంది. మొత్తం రూ. 1,50,000 వసూలు చేస్తారు.

## ట్రైబల్ వెడ్డింగ్!

ఈశాన్య రాష్ట్రాల అందాలకు ఫిదా కాని వారు ఎవరు ఉంటారు చెప్పండి! కాస్త సమయం చిక్కితే ఈ ప్రాంతాలకు వెళ్లాలనుకునేవాళ్లు చాలామంది ఉంటారు. కేవలం పర్యాటకానికే కాదు డెస్టినేషన్ వెడ్డింగ్స్‌కు కూడా మేఘాలయ రాష్ట్రం కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఇక్కడే చాలా రిసార్టులు ఈ సౌకర్యం కల్పిస్తున్నాయి. అంతేకాదు ఇక్కడ ట్రైబల్ వెడ్డింగ్ కూడా చేసుకోవచ్చు. ఈ రాష్ట్రంలో కాశీ తెగ వారు అత్యధికంగా ఉంటారు. అక్కడ ఉన్న జైనిటా పర్వతాల మధ్య ఉన్న ఓ చిన్న పల్లెలో ఈ వివాహం చేసుకోవచ్చు. చాలా సింపుల్‌గా ఉంటుంది. వధూవరులిద్దరూ కాశీ తెగవారి దుస్తులు ధరిస్తారు. ఉంగరాలు మార్చుకుంటారు.


ఎలా వెళ్లాలి: మేఘాలయ రాజధాని షిల్లాంగ్ నుంచి డాకి పట్టణం 81 కి.మీ దూరంలో ఉంది.

## సింపుల్..'టు స్టేట్స్' టెంపుల్

అమ్మాయి.... దక్షిణాది రాష్ట్రం తమిళనాడులో పుట్టింది. ఇక అబ్బాయి.... స్వస్థలం పంజాబ్. వీరిద్దరూ కలిసింది ఐఐఎమ్ అహ్మదాబాద్‌లో. ఇద్దరూ ప్రేమలో పడ్డారు. వేర్వేరు నేపథ్యాలు. విభిన్న సంస్కృతులు. నానా తంటాలు పడి పెద్దలను ఒప్పించుకున్నారు. ఇక చివరికి మహాబలిపురం సాగరతీరంలో ఉన్న ప్రఖ్యాత ఆలయంలో పెళ్లి చేసుకున్నారు. ఇది చాలా క్రితం వచ్చిన 'టూ స్టేట్స్' అనే సినిమా కథ. ఈ పెళ్లి సన్నివేశం చాలా ఫేమస్ అయింది. అంతే కాదు ఆ తర్వాత ఆ మహాబలిపురం గుడిలో డెస్టినేషన్ వెడ్డింగ్‌కు డిమాండ్ పెరిగింది. వధూవరులు అక్కడికి దగ్గర్లో ఉన్న రిసార్టులు బుక్ చేసుకొని, ఈ ఆలయంలో వివాహం చేసుకుంటున్నారు.

**ఎలా వెళ్లాలి:** చెన్నై నుంచి 56 కి.మీ దూరంలో ఉంది.

# ఇసుక కొండల్లో... భయం భయంగా!



దుబాయ్ ఆకాశహర్మ్యాలకే కాదు... ఎడారి యాత్రలకు కూడా ప్రసిద్ధమైనదే. 'ఆకాశాన్ని ముద్దాడాలని తహతహలాడుతున్నాయా!' అన్నట్టు ఉన్నాయి దుబాయ్‌లోని భవన సముదాయాలు. చక్కని పరిశుభ్రమైన నగరం దుబాయ్. విశాలమైన రోడ్లు, ఫ్లై ఓవర్‌లతో అలజడి లేని అరేబియన్ సముద్రతీరాన వెలసిన స్వర్గధామం కొత్త దుబాయ్ నగరం. 'వ్వావ్ దుబాయ్' అనిపించింది తొలిచూపులోనే! హైదరాబాద్ నుంచి దుబాయ్‌కి ప్రయాణం నాలుగు గంటల లోపే!

### మామూలు కార్లకు నో ఛాన్స్!

దుబాయ్ నగరానికి సుమారు 40 కి.మీ. దూరంలో గొప్ప ఎడారి ఉంది. ఎడారి అంటే అంతా పెద్ద ఇసుక కొండలు. మన ప్రాంతంలో చాలాచోట్ల రాతి కొండలు కనిపిస్తాయి. కానీ ఇసుక కొండలు దుబాయ్‌కి ప్రత్యేకం. ఈ ఎడారిలో మన మామూలు నాలుగు చక్రాల కార్లు నడవవు. ఎనిమిది చక్రాలుగల లాండ్ క్రూయిజ్ వంటి భారీ వాహనాలను ఈ సఫారీ యాత్రకు ఉపయోగిస్తారు.


మా అందరి కోసం ఓ ఎనిమిది లాండ్ క్రూయిజ్‌లు ఏర్పాటు చేశారు. తొలిసారిగా ఎడారిలో ప్రయాణమేమో, ఎంతో మధురానుభూతి కలిగిస్తుందనుకున్నాం. తీరా ప్రయాణం మొదలయ్యాక తెలిసింది ఆ పర్యటన ఎంత భయానకమో! ప్రయాణమంతా ఇసుక కొండలు, ఆ పక్కనే వున్న లోయల్లో సుమారు ముప్పై నిమిషాలకు పైగా సాగింది. అక్కడ డ్రైవర్లు చాకచక్యంగా నడపగల సమర్థులే. అయినప్పటికీ ఈ ప్రయాణం సాహసోపేతమైనదనే చెప్పాలి. ఈ యాత్రలో ప్రమాదాలు సర్వసాధారణం అని డ్రైవర్ చెప్పాడు. రక్తపోటు, గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారికి ఇది ఏ మాత్రం సురక్షితం కాదన్నాడు. అపురూపమైన ఆ ఎడారిలో ప్రాణాలు అరచేతిలో ఉంచుకొని, భయం భయంగా ఆ టూర్‌ని ఆస్వాదించాం. డిజర్ట్ సఫారీ యువతకు కూడా అంత క్షేమం కాదు. ఆ ప్రాణాంతకమైన యాత్రను ఇప్పుడు తలుచుకుంటే వెన్నులోంచీ చలి పుట్టుకొస్తోంది. దుబాయ్ వెళ్ళి వచ్చిన వారిని 'అక్కడ సఫారీకి వెళ్ళారా?' అని అడుగుతూ ఉంటారు. సాహస ప్రవృత్తి, ఆరోగ్యం, గుండె ధైర్యం ఉన్నవాళ్ళే ఈ యాత్రకు సిద్ధపడడం మంచిదన్నది నా వ్యక్తిగత అనుభవం ద్వారా వచ్చిన అభిప్రాయం!

# అద్భుతాల గుహ..

అదొక సున్నపురాతి గుహ. ఆ గుహలోకి అడుగుపెడితే ఆశ్చర్యం కలిగించే అద్భుత నిర్మాణాలు, పిల్లి, సింహం, ఇతర జీవులు విగ్రహాల్లా దర్శనమిస్తూ, కనువిందు చేస్తాయి. అలాగనీ వాటిని ఏ చిత్రకారులు చెక్కలేదు. అవి ప్రకృతి చెక్కిన ఆకృతులు. ఈ గుహ పేరు 'అల్ హుటా'. ఇరవై లక్షల సంవత్సరాల క్రితం ఏర్పడిన ఈ గుహ ఒమన్‌లోనే ప్రసిద్ధి గాంచిన పర్యాటక స్థలం.

### ఎలా ఏర్పడిందంటే!

వర్షం కురిసినప్పుడు గాలిలోని కార్బన్‌డయాక్సైడ్ కరిగి, కార్బోనిక్ ఆమ్లం ఉత్పత్తి అవుతుంది. కార్బోనిక్ ఆమ్లం ఉన్న నీళ్లు పారడంతో గుహలోని సున్నపురాయి కరిగి విభిన్నమైన ఆకారాలు సహజ సిద్ధంగా ఏర్పడ్డాయి. ఒమన్‌లో ఇలాంటి గుహలు చాలా ఉన్నాయి. అయితే ఏ గుహలో లేని ఆకృతులు అల్ హుటా గుహ సొంతం. కార్బోనిక్ ఆమ్లం వల్ల 100 ఏళ్లలో 100 మిల్లీమీటర్ల సున్నపురాయి కరిగిపోతూ ఉంటుంది. ఈ క్రమంలో ఇక్కడ రాళ్ల దొంతరలు, పరదాల వంటివి ఏర్పడటానికి ఇరవై లక్షల సంవత్సరాలు పట్టింది.



### ఇవీ ఆకర్షణలు:

గుహ లోపల భూమి నుంచి పొడుచుకు వచ్చినట్లుగా ఉండే పెద్ద సింహం, పిల్లి, ఇతర జంతువుల ఆకారాలు, గుహ పై భాగం నుంచి వేలాడుతూ ఉండే రకరకాల వింత రూపాలు, రంగు రంగుల్లో మెరిసిపోయే రాళ్ల వరసలు పర్యాటకులను అమితంగా ఆకట్టుకుంటాయి. ఈ గుహలో 800 మీటర్ల పొడవైన సరస్సు ఉంది. అరుదైన 'గ్యారెబ్యారెఇమియాయి' (బ్లైండ్ ఫిష్)అనే చూపు పూర్తిగా లేని చేపలను ఈ సరస్సులో చూడొచ్చు. గబ్బిలాలు, ఇతర కీటకాలు, మొలస్కాలు, నత్తలు, నీటి పురుగులు కూడా ఉంటాయి.

### ఎలా వెళ్లాలి:

ఒమన్‌లోనే ఎత్తైన జబల్ షామ్స్ పర్వత పరిసర ప్రాంతాల్లో ఉంది అల్ హూట గుహ. ఒమన్‌లో నిజ్వా, బహ్లా పట్టణాలకు మధ్యన 34 కి.మీ. దూరంలో ఈ గుహ ఉంది. మస్కట్ నుంచి రెండు గంటలు ప్రయాణిస్తే 'అల్ హుటా' గుహ ఉన్న ప్రాంతానికి చేరుకోవచ్చు. అన్నట్టు అరేబియా ద్వీపకల్పంలో పర్యాటకులను అనుమతిస్తున్న, మొదటి, ఏకైక గుహ కూడా ఇదే!

### ముందస్తు బుకింగ్:

సందర్శకులను విద్యుత్ రైల్లో గుహ ప్రవేశ ద్వారం వద్దకు తీసుకెళ్తారు.ఒక గంటలో గుహను చూసి రావడానికి అనుమతిస్తారు. పర్యావరణ శాఖ ఆదేశాల మేరకు రోజుకు 750 మంది పర్యాటకులకు మాత్రమే అవకాశం ఉంటుంది. ముందస్తు టికెట్ బుకింగ్ సౌకర్యం కూడా ఉంది.

### అనుమతించే వేళలు:


మంగళవారం నుంచి ఆదివారం వరకు పర్యాటకులను ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల మధ్య గుహలోకి అనుమతిస్తారు. నాలుగున్నర కిలోమీటర్ల పొడవున్న ఈ గుహలో 500 మీటర్ల దూరం వరకు వెళ్లడానికి వీలుంటుంది. గుహ సమీపంలో అక్కడి భూగర్భశాఖ ఏర్పాటు చేసిన ప్రదర్శనలో ఒమన్ చరిత్ర, అల్ హుటా గుహతో పాటు, ఒమన్‌లోని ఇతర గుహల విశేషాలనూ తెలుసుకోవచ్చు.

గుహ పై భాగం నుంచి వేలాడుతూ ఉండే రకరకాల వింత రూపాలు, రంగు రంగుల్లో మెరిసిపోయే రాళ్ల వరసలు పర్యాటకులను అమితంగా ఆకట్టుకుంటాయి. అరుదైన 'గ్యారెబ్యారెఇమియాయి' అనే చూపు పూర్తిగా ఉండని చేపలను ఈ గుహలోని సరస్సులో చూడొచ్చు.



## ఆనంద్ దేవరకొండ..
# తక్షకుడు

బేబి సినిమాతో సూపర్ హిట్టు కొట్టాడు ఆనంద్‌దేవరకొండ. ఆ తర్వాత వినోద్ అనంతోజ్ డైరెక్షన్‌లో నటించిన మిడిల్ క్లాస్ మెలోడీస్ బాక్సాఫీస్ వద్ద మంచి టాక్ తెచ్చుకుంది. వినోద్ అనంతోజ్, ఆనంద్ దేవరకొండ కాంబోలో మరో సినిమా రాబోతుంది. ఈ ఇద్దరూ ఈ సారి విభిన్న కథాంశంతో వస్తున్నట్టు తాజాగా రిలీజ్ చేసిన పోస్టర్ చెబుతోంది. ఆనంద్ దేవరకొండ నటిస్తున్న నెట్‌ఫ్లిక్స్ ఒరిజినల్ సీరిస్ ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటిస్తూ టైటిల్, ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది. ఇందులో ఆనంద్ దేవరకొండ నక్సలైట్‌గా కనిపించబోతున్నట్టు క్లారిటీ ఇచ్చేశారు మేకర్స్. వేటగాడి చరిత్రలో జింకలు దోషులు.. అనే క్యాప్షన్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ మూవీలో లాపతా లేడీస్ ఫేం నటాన్షి గోయెల్ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమా బ్యానర్లపై సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ప్రీమియర్ డేట్‌తోపాటు ఇతర వివరాలపై రానున్న రోజుల్లో క్లారిటీ ఇవ్వనుంది ఆనంద్ దేవరకొండ టీం. తిరుగుబాటు ప్రతీకార డ్రామా నేపథ్యంలో వచ్చే ఈ చిత్రంపై ఫస్ట్ లుక్‌తో అంచనాలు పెరిగిపోతున్నాయి. థియేటర్‌తో పాటు ఓటీటీలో విడుదలైన సినిమాలు కూడా ఆదరణ సొంతం చేసుకుంటోన్న విషయం తెలిసిందే. ఓటీటీ ట్రెండ్‌ను ఫాలో అవుతూ యంగ్ హీరో ఆనంద్ దేవరకొండ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. ఇలా యాక్షన్ ఫిల్మ్‌తో ఓటీటీ ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆయన ప్రధాన పాత్రలో రానున్న చిత్రం 'తక్షకుడు'. నెట్‌ఫ్లిక్స్ వేదికగా విడుదల కానుంది. వినోద్ దర్శకత్వంలో ఇది రూపొందుతోంది. 'వేటగాడి చరిత్రలో జింక పిల్లలే నేరస్థులు..' అంటూ ఓ పోస్టర్‌ను పంచుకున్నారు. త్వరలోనే దీనికి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించనున్నారు.



## శ్రీవారిని దర్శించుకున్న కృతిశెట్టి

### వేరుగా వచ్చిన ఎన్టీఆర్ సతీమణి ప్రణతి

తిరుమల శ్రీవారిని సినీ నటి కృతి శెట్టి దర్శించుకున్నారు. వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో స్వామివారి సేవలో ఆమె పాల్గొన్నారు. తితిదే అధికారులు ఆమెకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను కృతి శెట్టికి అందజేశారు. అలాగే తిరుమల శ్రీవారిని జూనియర్ ఎన్టీఆర్ సతీమణి లక్ష్మి ప్రణతి దర్శించుకున్నారు. వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో నూతన వధూవరులు నార్నె నితిన్ దంపతులతో కలిసి స్వామివారి సేవలో ఆమె పాల్గొన్నారు. తితిదే అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను వారికి అందజేశారు.

## వారిది ఒక్కొక్కరిది ఒక్కో స్టయిల్: ప్రియమణి

ప్రముఖ నటి ప్రియమణి... బాలీవుడ్ అగ్రనటులు షారుఖ్ ఖాన్, అజయ్ దేవగణ్, మనోజ్ బాజ్‌పేయిలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆ ముగ్గురూ వారి వారి జోనర్లలో



సూపర్‌స్టార్లని, అయితే ఒక్కొక్కరి పనితీరు పూర్తి భిన్నంగా, ఎంతో విలక్షణంగా ఉంటుందని ఆమె అన్నారు. ఇటీవల ఐఏఎన్ఎస్ వార్తా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆమె ఈ విషయాలను పంచుకున్నారు.

స్టార్ హీరోలతో పనిచేసిన అనుభవం గురించి అడిగిన ప్రశ్నకు ప్రియమణి స్పందిస్తూ, "వారికి వారే సూపర్‌స్టార్లు. ఒక్కొక్కరి వర్కింగ్ స్టైల్ చాలా ప్రత్యేకంగా ఉంటుంది. నా కెరీర్ ప్రారంభంలోనే అంతటి గొప్ప నటులతో కలిసి పనిచేసే అవకాశం రావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. మళ్లీ అవకాశం వస్తే తప్పకుండా వారందరితో కలిసి పనిచేయాలని ఉంది," అని తన మనసులోని మాటను బయటపెట్టారు.

వారు ఈ స్థాయికి చేరుకోవడానికి ఎంతో కష్టపడ్డారని, వారి విజయాలకు వారు పూర్తిగా అర్హులని ప్రియమణి కొనియాడారు. వారికి ఎల్లప్పుడూ మంచి జరగాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆమె తెలిపారు.


ప్రియమణి ఇటీవలే అట్లీ దర్శకత్వంలో వచ్చిన యాక్షన్ థ్రిల్లర్ 'జవాన్'లో షారుఖ్ ఖాన్‌తో కలిసి లక్ష్మి అనే కీలక పాత్రలో నటించారు. అలాగే, భారత ఫుట్‌బాల్ కోచ్ సయ్యద్ అబ్దుల్ రహీమ్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన 'మైదాన్' చిత్రంలో అజయ్ దేవగణ్‌కు జోడీగా కనిపించారు. ఇక మనోజ్ బాజ్‌పేయితో కలిసి ఆమె నటించిన 'ది ఫ్యామిలీ మ్యాన్' వెబ్ సిరీస్ ఎంతటి ఆదరణ పొందిందో తెలిసిందే. ఇందులో ఆమె పోషించిన సుచిత్ర తివారీ పాత్రకు మంచి పేరు వచ్చింది. త్వరలో రాబోతున్న 'ది ఫ్యామిలీ మ్యాన్ 3' సీజన్‌లో కూడా ప్రియమణి తన పాత్రలో మళ్లీ కనిపించనున్నారు.

# ఒక్క ముద్దు సన్నివేశం లేదు

### తెలుసుకదా ట్రైలర్ విడుదలలో సిద్దూ



సిద్దు జొన్నలగడ్డ కథానాయకుడిగా రూపొందిన రొమాంటిక్ డ్రామా మూవీ 'తెలుసు కదా' రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి కథానాయికలు. కాస్ట్యూమ్ డిజైనర్ నీరజ కోన ఈ సినిమాతో దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. ఈ మూవీ అక్టోబరు 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను సోమవారం విడుదల చేశారు ఈ నేపథ్యంలో తాజాగా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. అందులో టీమ్ పంచుకున్న విశేషాలివి. సిద్ధూతో రొమాంటిక్ సినిమా తీయాలనే ఆలోచన ఎలా వచ్చిందన్న ప్రశ్నకు
ఈ కాన్సెప్ట్‌కు సిద్ధూ అయితేనే న్యాయం చేయగలరని అనిపించింది. ఈ సినిమా షూటింగ్ చాలా ఎంజాయ్ చేశాం అని దర్శకురాలు నీరజ కోన అన్నారు. మొదట చూపిన ప్రచార చిత్రాలకు ఇప్పుడు రిలీజ్ చేసిన వాటికి సంబంధం లేనట్లు ఉంది? కావాలనే అలాంటి పోస్టర్స్ రిలీజ్ చేశారా? అని అడగ్గా
కావాలని చేసింది కాదు. సినిమా ప్రారంభించినప్పటి నుంచి ప్రచార చిత్రాలు విడుదల చేస్తూ వచ్చాం అని సిద్ధూ అన్నారు. షూటింగ్ చేసే క్రమంలో కొన్ని మార్పులు చేశాం. అందుకే అలా డిఫరెంట్‌గా ఉన్నాయి. ట్రైలర్‌తో కథను చెప్పాలని అనుకున్నాం. దీపావళికి పోటీ చాలా ఉంది. ఆ సమయంలోనే విడుదల చేయడం రిస్క్ అనిపించడం లేదా? అంటే.. రిస్క్ ఉన్నచోటే విజయం ఉంటుంది. నా గత చిత్రం అనుకున్న స్థాయిలో



అలరించలేకపోయింది. ఒక సినిమా నన్ను కింద పడేస్తే.. మరొకటి టాప్‌లో చేర్చుతుందని నమ్ముతాను. ఈ సినిమాలో పాత్ర 'టిల్లు' పాత్రను పోలి ఉందా? అని అంటే...దానికి, దీనికి సంబంధం ఉండదు. ఇందులో దానికి మించిన వినోదం ఉంటుందన్నారు. ఎప్పుడూ ఇద్దరు హీరోయిన్లతో మూవీ చేస్తున్నారని ఎందుకని అడిగితే...నేను ఇప్పటివరకూ ఇద్దరు హీరోయిన్లతో చేసింది ఒకే సినిమా 'కృష్ణా అండ్ హిజ్ లేడీ'. దానిలో ముగ్గురు హీరోయిన్లు ఉన్నారు. 'టిల్లు స్క్వేర్'లో అతిథి పాత్రలో మరో హీరోయిన్ ఉన్నారంతే. లవ్ స్టోరీ కాబట్టి దానికి తగినట్లే తెరకెక్కించారు. ఇందులో ముద్దు సన్నివేశాలు లేవు. ఒక్క ముద్దు సీన్ కూడా ఉండకూడదు అని కథ చెప్పినప్పుడే నీరజకు కండీషన్ పెట్టా. ఇది ఫ్యామిలీ మూవీ. ఇద్దరు హీరోయిన్లు, దర్శకురాలు, నిర్మాత.. అందరూ మహిళలే.. వాళ్లందరితో వర్క్ చేయడం సరదాగా అనిపించింది. రాశీ ఖన్నా అయితే క్లైమాక్స్‌లో నేను చేయను అని 40 నిమిషాలు సెట్ నుంచి వెళ్లిపోయింది. 'నా బాయ్‌ఫ్రెండ్ ఇలా చేస్తే నేను అంగీకరించను' అని పక్కకి వెళ్లి కూర్చొంది. ఇది కేవలం పాత్ర అని చెప్పి తీసుకొచ్చాను. సెట్‌లో 16 మంది మహిళలు ఉండేవారు. వాళ్లందరిలో నేను ఒక్కడినే ఉండేవాడిని. ఇకపోతే సినిమా అన్నాక.. డబ్బులు వస్తుంటాయి, పోతుంటాయి..




## జై హనుమాన్‌పై రిషబ్ వ్యాఖ్యలు

### సినిమా ఆలస్యం కానుందన్న సంకేతాలు

'కాంతార చాప్టర్ 1'తో మళ్లీ ఒక్కసారి బాక్సాఫీస్‌ను శాసించిన కన్నడ స్టార్ రిషబ్ శెట్టి, ఇప్పుడు తన తదుపరి చిత్రం 'జై హనుమాన్' గురించి చేసిన కామెంట్స్‌తో హాట్ టాపిక్ అయ్యాడు. ఇప్పటికే భారీ అంచనాలు ఉన్న ఈ ప్రాజెక్ట్ కోసం అభిమానులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. అయితే, రిషబ్ చేసిన తాజా వ్యాఖ్యలతో ఫ్యాన్స్ కాస్త నిరాశలో ఉన్నారు. 'కాంతార చాప్టర్ 1' ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రిషబ్ శెట్టి, తన తదుపరి ప్రాజెక్టుల గురించి స్పందించారు. 'చాప్టర్ 1 తర్వాత నేను చేస్తున్న సినిమా 'జై హనుమాన్'. ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహిస్తారు. ఈ సినిమా 2026 జనవరిలో సెట్స్‌పైకి వెళ్తుంది. ఆ తర్వాత నా డైరెక్షన్‌లో మరో సినిమా ఉంటుంది, అది రెండేళ్లలో వస్తుంది' అని ఆయన వెల్లడించారు. ఈ కామెంట్స్ విన్న తర్వాత అభిమానులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఇప్పటికీ షూటింగ్ ప్రారంభం కాలేదా? 2026 జనవరి అంటే సినిమా రిలీజ్‌కు ఇంకెన్నాళ్లు? అంటూ అభిమానులు సోషల్ మీడియాలో ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. గతంలో 'జై హనుమాన్' సినిమా నుంచి రిషబ్ శెట్టి ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ అయినప్పుడు షూటింగ్ స్టార్ట్ అయిందన్న భావన అభిమానుల్లో ఏర్పడింది. కానీ ఆ ఫొటో కేవలం ఫోటోషూట్ మాత్రమేనని, అసలు షూటింగ్ ఎప్పుడు మొదలవుతుందనే క్లారిటీ ఇప్పుడే వచ్చింది. 2026 జనవరిలో సెట్స్ పైకి వెళ్తే, పోస్ట్-ప్రొడక్షన్, గ్రాఫిక్స్, ప్రమోషన్స్ అన్నింటినీ కలుపుకుంటే ఈ సినిమా విడుదలకు కనీసం 2027 వరకు వేచి చూడాల్సి రావచ్చు అన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇదే గ్యాప్‌లో రిషబ్ శెట్టి దర్శకత్వం వహించే మరో ప్రాజెక్ట్ కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

## హిందీలో రీమేక్ కానున్న
# సంక్రాంతికి వస్తున్నాం

తెలుగు బ్లాక్‌బస్టర్ 'సంక్రాంతికి వస్తున్నాం' ఇప్పుడు బాలీవుడ్‌లో రీమేక్ కానుందంటూ నెట్టింట పలు వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. విక్టరీ వెంకటేష్, ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి ప్రధాన పాత్రల్లో అనీల్ రావిపూడి తెరకెకక్కించిన సంక్రాంతికి వస్తున్నాం చిత్రం గత సంక్రాంతి 2025 సందర్భంగా విడుదలై భారీ విజయాన్ని అందుకుంది . దిల్ రాజు నిర్మించిన ఈ సినిమా రూ.300



కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లతో ఇండస్ట్రీ హిట్ గా నిలిచింది. ఈ క్రమంలో చిత్రాన్ని బాలీవుడ్‌లో రీమేక్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు దిల్ రాజు. బాలీవుడ్ రీమేక్ స్టార్ అక్షయ్ కుమార్‌తో సంప్రదింపులు కూడా చేస్తున్నట్టు టాక్ నడుస్తుంది. అక్షయ్ కుమార్ ఇప్పటికే 'భూల్ భులయ్యా 2', 'రౌడీ రాథోర్', 'లక్ష్మి' వంటి దక్షిణాది రీమేక్‌లతో హిట్ ట్రాక్‌లో ఉన్నారు. అయితే ఇటీవల వరుస

ఎ÷–లాపులతో అక్షయ్ కుమార్ కెరీర్ ఒడిదుడుకుల్లో సాగుతోంది. ఈ సమయంలో ఆయన మళ్లీ సౌత్ ఇండస్ట్రీ సూపర్ హిట్ చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం' లాంటి కథను ఎంచుకుంటే సేఫ్ జోన్‌లో పడతాడని విశ్లేషకులు కూడా అంటున్నారు. బాలీవుడ్ ట్రేడ్ వర్గాల ప్రకారం, దిల్ రాజు ప్రస్తుతం ఈ సినిమాను హిందీలో నిర్మించేందుకు బాలీవుడ్ మేకర్స్‌తో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం . వెంకటేష్ చేసిన పాత్రకు అక్షయ్ కుమార్ సరైన ఎంపిక అని చాలా మంది భావిస్తున్నారు.(తెలుగులో ఈ సినిమా విజయానికి కథ కంటే కూడా వెంకటేష్ టైమింగ్, కామెడీ టచ్, అనిల్ రావిపూడి మేకింగ్ ప్రధాన కారణాలుగా నిలిచాయి. అయితే బాలీవుడ్ ప్రేక్షకుల అభిరుచికి అనుగుణంగా కథ, స్క్రీన్‌ప్లేలో మార్పులు చేయాల్సిన అవసరం ఉందని సినీ విశ్లేషకులు చెబుతున్నారు. అలాంటివి లేకపోతే , ఈ సినిమా డిజాస్టర్ అయ్యే అవకాశం ఉందని నెటిజన్ల అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

PUBLISHED BY G.KALPANA AND PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254,MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI ,TELANGANA, EDITOR : G.DAYAKAR REDDY , RNI :TELTEL/2022/83927, PHONE NUMBER 9908293393,040- 45046154